
RNI. TGTEL/25/A1665

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

బూర నగేష్ గౌడ్
ఎడిటర్

మండలాలవారీగా
విలేకరులు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యత
ఐడి కార్డు, ట్యాగ్, లోగో, వెహికల్ స్టిక్కర్స్ ఇవ్వబడును
ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు
94419 74025
మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా

www.nityamnigha.com
RNI. TGTEL/25/A1665
నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక
NITYAM NIGHA TELUGU DAILY
మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా
Published From : Warangal
Circulated at : Telangana All Districts



వరంగల్ | సంపుటి 2 | సంచిక 108 | ఎడిటర్ - బూర నగేష్ గౌడ్ | మంగళవారం | 20.10.2026 | పేజీలు : 8

తెలంగాణపై ఎల్‌నినో ఎఫెక్ట్..
- పొదుపు బాటలో ప్రభుత్వం..!

- ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో పెరిగిన విద్యుత్ డిమాండ్
- ప్రభుత్వ కార్యాలయాల్లో ఏసీల వాడకంపై ఆంక్షలు విధింపు
- పరిశ్రమలకు విద్యుత్ కోతలు ఉండవని స్పష్టం చేసిన సర్కార్
- తాగునీటి కొరత రాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు, కార్యాచరణ
- హైదరాబాద్‌లో అక్రమ నీటి మోటార్లపై ప్రత్యేక డ్రైవ్



నిత్యం నిఘా, హైదరాబాద్ : ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో విద్యుత్, నీటి వినియోగం గణనీయంగా పెరిగింది. మరోవైపు ఉత్పత్తి, లభ్యత ఆశించిన స్థాయిలో లేకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. పొదుపు చర్యలతో పాటు ప్రత్యామ్నాయ ప్రణాళికలను సమర్థవంతంగా అమలు చేసేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగా ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్ వాడకాన్ని తగ్గించాలని ఆదేశాలు జారీ చేసింది. సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఈ మేరకు ఉన్నతాధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. పగటి వేళల్లో అత్యవసరమైతే తప్ప ఎయిర్ కండిషనర్లను (ఏసీ) వినియోగించవద్దని, వాటిని కూడా 25 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత వద్దే నిర్వహించాలని స్పష్టం చేశారు. సాయంత్రం 6 గంటల తర్వాత ఏసీల వినియోగాన్ని గణనీయంగా ....

మిగతా 2 వ పేజీ లో..



పండగల వేళ పోలీసు శాఖలో భారీగా ఎస్ఐల బదిలీ

- హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 75 మంది ఎస్ఐల బదిలీ
- పండగల సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని పాలనాపరమైన మార్పులు
- లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్, క్రైమ్ విభాగాల్లో పనిచేస్తున్న అధికారులకు స్థానచలనం



2

'రెజీమ్ ఛేంజ్'పై కిరణ్ రిజిజుకు శశిథరూర్ కౌంటర్

- "రెజీమ్ ఛేంజ్" అంటూ వ్యాఖ్యానించిన నేహా బోరా
- "రెజీమ్ ఛేంజ్" వ్యాఖ్యలపై కిరణ్ రిజిజు, శశి థరూర్ మధ్య మాటల యుద్ధం
- భారత్ బంగ్లాదేశ్ కాదంటూ ప్రతిపక్షాలపై విరుచుకుపడిన కిరణ్ రిజిజు
- మా లక్ష్యం ఎన్నికల ప్రక్రియను కాపాడటమేనని స్పష్టం చేసిన శశి థరూర్
- ఓటర్ల జాబితా సవరణపై కొనసాగుతున్న రాజకీయ వివాదం



2

కాంగ్రెస్ నేతలకు లీగల్ నోటీసులు
కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు నీటి మళ్లింపు ఆరోపణలు..

- మహేశ్ గౌడ్, పొంగులేటి, వంశీకృష్ణకు బీఆర్ఎస్ నోటీసులు
- నోటీసులు జారీ చేసిన సోమ భరత్ కుమార్
- సోషల్ మీడియా పోస్టులు తొలగించాలని బీఆర్ఎస్ డిమాండ్
- తప్పుడు ప్రచారాన్ని ఉపసంహరించుకోవాలని సూచన



నిత్యం నిఘా, హైదరాబాద్ : కొండపోచమ్మ సాగర్ నీటిని మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు మళ్లించారంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ ముగ్గురు కాంగ్రెస్ నేతలకు బీఆర్ఎస్ లీగల్ నోటీసులు జారీ చేసింది. తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ గడ్డం వంశీకృష్ణకు ఈ నోటీసులు పంపించింది. బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ, లీగల్ సెల్ ఇన్‌ఛార్జ్ సోమ భరత్ కుమార్ వీటిని జారీ చేశారు. కేసీఆర్ ప్రతిష్ఠను దెబ్బతీసేలా నిరాధార ఆరోపణలు చేస్తున్నారని బీఆర్ఎస్ లీగల్ సెల్ పేర్కొంది. ఈ అంశంపై ఇప్పటికే 'వెలుగు' దినపత్రిక యాజమాన్యం, ఎడిటర్‌కు నోటీసులు పంపించినట్లు తెలిపింది.....

2



నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

తెలంగాణపై ఎల్‌నినో ఎఫెక్ట్..

- పాడుపు బాటలో ప్రభుత్వం..!

మొదటిపేజీ తరువాయి.. తగ్గించాలని ఆదేశించారు. రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి ఆశాజనకంగా లేనప్పటికీ, వ్యవసాయ, గృహ అవసరాలకు నిరంతరాయంగా సరఫరా అందిస్తున్నామని తెలిపారు. పరిశ్రమలకు ఎలాంటి విద్యుత్ కోతలు విధించడం లేదని, పారిశ్రామిక యాజమాన్యాలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. అన్ని థర్మల్ పవర్ స్టేషన్లలో విద్యుత్ ఉత్పత్తిని గరిష్ఠ స్థాయికి పెంచేందుకు చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో తలెత్తే తాగునీరు, విద్యుత్ కొరతను నివారించేందుకు క్షేత్రస్థాయిలో పటిష్టమైన కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని సంజయ్ జాజు సూచించారు. ఈ అంశంపై త్వరలోనే అఖిలపక్ష సమావేశం, కేబినెట్ సబ్-కమిటీ భేటీ నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు.స్థానిక నీటి వనరుల నుంచి వ్యవసాయానికి అక్రమంగా మోటార్లు బిగించి నీటిని తోడేస్తుండటంతో, విద్యుత్ లోడ్ పెరిగి ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని ఇంధన శాఖ అధికారులు సమావేశంలో వివరించారు. మంజీరా, సింగూరు రిజర్వాయర్ల నుంచి నీటి లభ్యత లేకపోవడంతో, అక్కడి నుంచి అందాల్సిన 110 మిలియన్ గ్యాలన్ల నీటిని మిషన్ భగీరథ (60 MGD), కృష్ణా నది వంటి ప్రత్యామ్నాయ వనరుల ద్వారా సర్దుబాటు చేస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లో తాగునీటి అవసరాలకు తప్ప నిర్మాణాలకు, ఇతర పనులకు కొత్త బోర్ల తవ్వకానికి అనుమతులు మంజూరు చేయవద్దని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ స్పష్టం చేశారు. నగరంలో మున్సిపల్ నల్లా కనెక్షన్లకు అక్రమంగా మోటార్లు బిగించి నీటిని తోడ్పతున్న వారిపై 'హైడ్రా' సహకారంతో ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నవంబర్ 1 నుంచి నిర్మాణాలకు గ్రీన్ ట్యాంకర్ల ద్వారా శుద్ధి చేసిన నీటిని (ఎస్‌టీపీ వాటర్) సరఫరా చేయనున్నట్లు ప్రకటించారు. రంగారెడ్డి జిల్లాలో భూగర్భ జలాలు గణనీయంగా తగ్గుతున్నాయని, తాగునీటి కొరత రాకుండా ప్రత్యామ్నాయ ప్రణాళికలు అమలు చేస్తున్నామని మరో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ తెలిపారు.

కాంగ్రెస్ నేతలకు లీగల్ నోటీసులు

కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు నీటి మళ్లింపు ఆరోపణలు..

మొదటిపేజీ తరువాయి.. తెలిపింది. అదే ప్రచారాన్ని కొనసాగిస్తున్నారనే ఆరోపణతో తాజాగా ముగ్గురు కాంగ్రెస్ నేతలకు కూడా నోటీసులు జారీ చేసింది. తమ సోషల్ మీడియా ఖాతాల్లో ఈ అంశానికి సంబంధించి చేసిన పోస్టులను వెంటనే బేషరతుగా తొలగించాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. తప్పుడు ప్రచారాన్ని ఉపసంహరించుకోవాలని నోటీసుల్లో పేర్కొంది. తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులపై ఆధారాలు లేని ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను సహించబోమని స్పష్టం చేసింది. నోటీసులకు స్పందించకపోతే పరువు నష్టం సహా వర్తించే చట్టాల ప్రకారం తదుపరి న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని బీఆర్ఎస్ లీగల్ సెల్ హెచ్చరించింది.

'మున్సిపల్' జీతాలు పెంచేదెప్పుడు..

మూడేండ్లుగా నయాపైసా పెంచని కాంగ్రెస్ ప్రభుత్వం



నిత్యం నిఘా, సిద్దిపేట : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేండ్లయినా మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు జీతాలు పెంచకుండా నిర్లక్ష్యం చేస్తున్నదని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ తన్నీరు హరీశ్‌రావు మండిపడ్డారు. నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతున్నా వారి జీతాలు మాత్రం పెరుగక ఇంటి అద్దె లు, విద్యుత్ బిల్లులు, రవాణా ఖర్చులతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నా రని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా తక్షణమే కార్మికుల జీతాలు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదే విధంగా .....ఇతర మున్సిపల్ విభాగాల కార్మికులకూ గ్రూపు విధానాన్ని వర్తింపజేయాలని రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీస్తానని స్పష్టంచేశారు. దసరా పండుగను పురస్కరించుకొని సోమవారం సిద్దిపేట మున్సిపల్ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులతో హరీశ్‌రావు ఆత్మీయంగా ముచ్చటించారు. వారితో కలిసి టిఫిన్ చేసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తన సొంత ఖర్చులతో మహిళా కార్మికులకు చీరలు, పురుషులకు ప్యాంట్లు, షర్టులు అందజేసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్మికులు చేస్తున్న సేవకు తన వంతుగా గౌరవం ఇవ్వాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమం చేపట్టినట్ట వివరించారు. పట్టణం పరిశుభ్రంగా కనిపించడం వెనుక వారి కష్టం, త్యాగం, నిరంతర శ్రమ దాగి ఉన్నాయని చెప్పారు. కాంగ్రెస్ పాలనలో కార్మికులకు ఎప్పుడూ కష్టాలేనని హరీశ్‌రావు విమర్శించారు. నాటి రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో పారిశుద్ధ్య కార్మికులకు మూడు, ఐదు, ఆరు నెలలపాటు జీతాలు అందని పరిస్థితులు ఉండేవని దుయ్యబట్టారు. వేతనాల కోసం కార్మికులు ఎర్రజెండాలు పట్టుకొని ఆర్డీవో కార్యాలయాలు, మున్సిపల్ కమిషనర్ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేయాల్సి వచ్చేదని ఆయన గుర్తుచేశారు. అప్పట్లో ఔట్ సోర్సింగ్ కార్మికులకు వేతనం రూ.8,300 మాత్రమే ఉండేదని, కాంట్రాక్టర్ల ప్రమేయంతో జీతాలు సకాలంలో అందడంలోనూ ఇబ్బందులు ఎదురయ్యేవని పేరొన్నారు.పారిశుద్ధ్య కార్మికుల వేతనాల పెంపు, ఇతర మున్సిపల్ విభాగాలకు గ్రూపు విధానం విస్తరణ, ఉద్యోగుల కుటుంబాలకు సంబంధించిన పెండింగ్ సమస్యల పరిషారం వంటి అంశాలపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తామని హరీశ్‌రావు తేల్చిచెప్పారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా నెరవేర్చాలని హితవు పలికారు. పట్టణాలను పరిశుభ్రంగా ఉంచే కార్మికుల జీవితాల్లోనూ వెలుగులు నిండినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని, వారి శ్రమకు తగిన ప్రతిఫలం అందే వరకు బీఆర్ఎస్ పోరాడుతుందని స్పష్టంచేశారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల వేతనాలను దశలవారీగా పెంచిందని హరీశ్‌రావు తెలిపారు.రూ.8,300 నుంచి రూ.16,600 వరకు పెంచడమే గాక కాంట్రాక్టర్లు, మధ్యవర్తుల ప్రమేయాన్ని తొలగించి ఏడుగురు కార్మికులతో ఒక గ్రూప్ ఏర్పాటుచేసి, ప్రభుత్వమే నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జీతాలు జమచేసే విధానాన్ని తీసుకొచ్చామని చెప్పారు. ఫలితంగా వేతనాల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగాల్సిన పరిస్థితి తగ్గిందని పేరొన్నారు. మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కార్మికుల వేతనాలను పెంచలేదని ఆరోపించారు. పారిశుద్ధ్య కార్మికులు వేతనాలు పెంచాలని కోరడంలో తప్పేమీ లేదని, వారి డిమాండ్ న్యాయమై నదని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి వేతనాల పెంపుపై నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. కరోనా మహమ్మారి సమయంలో ప్రజలు ఇండ్లకే పరిమితమైనప్పటికీ వారు మాత్రం ప్రాణాలు పణంగా పెట్టి వీధులను శుభ్రం చేశారని హరీశ్‌రావు కొనియాడారు. ఆ సమయంలో తాను మంత్రిగా ఉండి కార్మికుల వెంట తిరిగి భరోసా కల్పించానని, అవసరమైన కిట్లు ఇచ్చినట్టు వివరించారు. సంక్షోభ సమయాల్లో ముందుండి సేవలందించే కార్మికులకు తగిన వేతనం, గౌరవం, ఉద్యోగ భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని చెప్పారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ప్రభుత్వమే నేరుగా వేతనాలు చెల్లించే విధానాన్ని ఇతర విభాగాలకూ విస్తరించాలని కోరారు.

రేవంత్ సర్కార్‌పై రూ.50 వేల కోట్ల స్కాం ఆరోపణలు..

- సీబీఐ విచారణకు క్రిశాంక్ డిమాండ్

నిత్యం నిఘా, హైదరాబాద్ : తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ సంచలన ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ అండతో రూ.50,000 కోట్ల విలువైన కుంభకోణాలు జరిగాయని, ముఖ్యంగా సెక్షన్ 22ఏ కింద ఉన్న నిషేధిత భూముల వ్యవహారంలో భారీగా అవినీతి చోటుచేసుకుందని ఆయన ఆరోపించారు. ఈ వ్యవహారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎలాంటి పాత్ర లేకపోతే, వెంటనే సీబీఐ విచారణకు ఆదేశించాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్ లో మీడియాతో క్రిశాంక్ మాట్లాడుతూ... ఈ భూ సెటిల్‌మెంట్ల వెనుక సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు కృష్ణారెడ్డి ఉన్నారని ఆరోపించారు. ఎమ్మెల్యేలను బెదిరించడమే కాకుండా, భూదందాల్లో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారని వ్యాఖ్యానించారు. చేవెళ్ల పరిధిలోని చందన్‌వల్లి గ్రామంలో సర్వే నంబర్ 363లోని అసైన్డ్ భూమిని వ్యవసాయ భూమిగా మార్చి, ఆర్9 కన్‌స్ట్రక్షన్స్ పేరుపై రిజిస్ట్రేషన్ చేశారని తెలిపారు. ఈ కంపెనీలో కృష్ణారెడ్డి భాగస్వామిగా ఉన్నారని ఆరోపించారు. ఇలాంటి భూ కబ్జాల కోసమే సెక్షన్ 22ఏను వాడుకుంటున్నారని అన్నారు. నియోజకవర్గానికి నిధులు కావాలంటే కాంగ్రెస్ కండువా కప్పుకోవాలని పోచారం శ్రీనివాస్ రెడ్డి చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా క్రిశాంక్ గుర్తుచేశారు. ఇదే సమయంలో ఒక ఆసుపత్రి అమ్మకం, మ్యాక్స్‌బిన్ ఫార్మా, మైండ్‌వాల్ట్ కార్పొరేట్ స్కూళ్లతో సీఎం కుటుంబ సభ్యులకు ఉన్న సంబంధాలపై కూడా ఆయన ప్రశ్నలు లేవనెత్తారు. ఈ ఆరోపణలపై బీజేపీ మౌనంగా ఉండటాన్ని కూడా ప్రశ్నించారు. ఈ కుంభకోణాలపై తమ వద్ద ఉన్న అన్ని పత్రాలు, డైరెక్టర్ల వివరాలు, వాటాల సమాచారాన్ని సీబీఐకి సమర్పించడానికి బీఆర్ఎస్ సిద్ధంగా ఉందని, దమ్ముంటే విచారణకు ఆదేశించాలని ముఖ్యమంత్రికి సవాల్ విసిరారు.



50 డిగ్రీలకు చేరనున్న ఎండలు?

గోదావరి నీటి నిల్వపై మంత్రి తుమ్మల కీలక ప్రకటన

- **సూపర్ ఎల్‌నినోతో ఎండలు 50 డిగ్రీలు దాటే అవకాశం ఉందని తుమ్మల వ్యాఖ్య**
- **వర్షాలు తగ్గితే భూగర్భ జలాలు అడుగంటిపోయే ప్రమాదం**
- **గోదావరి నీటిని నిల్వ చేసేందుకు ప్రభుత్వం చర్యలు**
- **దుమ్ముగూడెం ఆనకట్టపై ఇసుక బస్తాలు ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశం**
- **భద్రాద్రి జిల్లా అమ్మగారిపల్లి వద్ద ఆనకట్టను మంత్రి పరిశీలన**

నిత్యం నిఘా, హైదరాబాద్ : తెలంగాణలో ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గి భూగర్భజలాలు అడుగంటిపోయే ప్రమాదం ఉందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. సూపర్ ఎల్‌నినో ప్రభావంతో ఉష్ణోగ్రతలు 50 డిగ్రీలు దాటే అవకాశం ఉందని తెలిపారు. తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా గోదావరి నీటిని నిల్వ చేసే చర్యలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు వెల్లడించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అమ్మగారిపల్లి వద్ద గోదావరి ఆనకట్టను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇవాళ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గోదావరి నీటిని నిల్వ చేసేందుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించిందని చెప్పారు. దుమ్ముగూడెం ఆనకట్టపై ఇసుక బస్తాలు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు వెల్లడించారు. వర్షాలు తగ్గి భూగర్భజలాలు పడిపోయే పరిస్థితి ఏర్పడితే వ్యవసాయంతో పాటు తాగునీటి సరఫరాపైనా ప్రభావం పడే అవకాశం ఉందని మంత్రి పేర్కొన్నారు. నీటి కొరతను దృష్టిలో పెట్టుకుని తక్కువ నీటితో సాగయ్యే పంటలను ఎంచుకోవాలని రైతులకు సూచించారు. నీటి లభ్యత తగ్గితే విద్యుత్ ఉత్పత్తిపైనా ప్రభావం పడుతుందని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు వరి సాగుకు దూరంగా ఉండాలని తుమ్మల సూచించారు. నీటి వనరులను జాగ్రత్తగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే వేసవిలో తాగునీటి కష్టాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రికి వివరించినట్లు చెప్పారు.



పండగల వేళ హైదరాబాద్ పోలీసు శాఖలో మార్పులు.. భారీగా ఎస్ఐల బదిలీ

మొదటిపేజీ తరువాయి.. హైదరాబాద్ నగరంలో పండగల సీజన్ సమీపిస్తున్న వేళ పోలీసు శాఖలో భారీగా మార్పులు చోటుచేసుకున్నాయి. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 75 మంది సబ్-ఇన్‌స్పెక్టర్లను (ఎస్ఐ) బదిలీ చేస్తూ నగర పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలనా సౌలభ్యం, శాంతిభద్రతల పటిష్ఠతలో భాగంగా ఈ బదిలీలు చేపట్టినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్లు, లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్, క్రైమ్, కంట్రోల్ రూమ్ విభాగాల్లో పనిచేస్తున్న అధికారులను ఈ బదిలీల ప్రక్రియలో భాగంగా మార్పు చేశారు. ముఖ్యంగా ఎక్కువ కాలంగా ఒకేచోట పనిచేస్తున్న అధికారులను గుర్తించి వేర్వేరు స్టేషన్లు, విభాగాలకు కేటాయించినట్లు తెలుస్తోంది. బదిలీ అయిన అధికారులు తక్షణమే తమ కొత్త పోస్టింగ్‌లలో బాధ్యతలు స్వీకరించాలని కమిషనర్ స్పష్టంగా ఆదేశించారు. ఈ విషయంలో ఎలాంటి ఆలస్యం లేదా నిర్లక్ష్యం ప్రదర్శించినా కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. రాబోయే పండగలు, నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ, భద్రతా అవసరాలను దృష్టిలో ఉంచుకునే ఈ మార్పులు చేసినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి.



'రెజీమ్ ఛేంజ్'పై కిరణ్ రిజిజుకు శశిథరూర్ కౌంటర్

మొదటిపేజీ తరువాయి.. దేశ రాజకీయాల్లో "రెజీమ్ ఛేంజ్" (అధికార మార్పిడి) అనే పదం పెను దుమారం రేపుతోంది. ఈ అంశంపై కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు చేసిన వ్యాఖ్యలకు కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ ధీటుగా బదులిచ్చారు. తాము ఆశిస్తున్నది స్వేచ్ఛాయుతమైన, నిష్పక్షపాతమైన ఎన్నికలే తప్ప, అప్రజాస్వామికంగా ప్రభుత్వాన్ని కూల్చడం కాదని ఆయన స్పష్టం చేశారు. అంతకుముందు, కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ప్రతిపక్షాలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియను విమర్శిస్తూ జేఎన్‌యూ విద్యార్థి కార్యకర్త నేహా బోరా 'రెజీమ్ ఛేంజ్' అని వ్యాఖ్యానించిన వీడియో క్లిప్‌లతో పాటు, ప్రతిపక్షాలకు మద్దతిచ్చే మరికొందరి దృశ్యాలను జత చేస్తూ కిరణ్ రిజిజు 'ఎక్స్' వేదికగా ఒక పోస్ట్ చేశారు. "ఈ వ్యక్తులను చూడండి, వీరు అధికార మార్పిడికి ప్రయత్నిస్తున్నారు. ఒకటి మాత్రం గుర్తుంచుకోండి, భారత్ బంగ్లాదేశ్ కాదు. భారత యువత ఎంతో తెలివైన వారు, వారు దేశాన్ని నిర్మిస్తారు తప్ప నాశనం చేయరు" అని ఆయన పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలపై శశిథరూర్ స్పందిస్తూ, "భారత్‌ను బంగ్లాదేశ్‌తో లేదా ఫ్రాన్స్‌తో పోల్చడం అసంబద్ధం. ఫ్రాన్స్‌లో జరిగినట్లుగా బస్సులను తగలబెట్టడం, పోలీస్ స్టేషన్లపై దాడులకు దిగడం వంటి హింసాత్మక చర్యలను మేమెప్పుడూ సమర్థించం. మేము కేవలం శాంతియుత నిరసనలకు మాత్రమే మద్దతు తెలుపుతాం" అని అన్నారు. 'రెజీమ్ ఛేంజ్' అనే పదాన్ని వక్రీకరించవద్దని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఓటర్ల జాబితా నుంచి పెద్ద సంఖ్యలో ప్రజల పేర్లను అస్తవ్యస్తమైన, పాక్షికంగా చట్టవిరుద్ధమైన పద్ధతుల్లో తొలగించారని శశిథరూర్ ఆరోపించారు. "ఇది పూర్తిగా రాజ్యాంగపరమైన సమస్య. ఈ లోపాలను సరిదిద్దాలని మాత్రమే మేము కోరుకుంటున్నాము. అంతేకానీ, అక్రమ మార్గాల్లో ప్రభుత్వాన్ని కూలదోయాలనే ప్రయత్నం ఎంతమాత్రం కాదు" అని ఆయన వివరణ ఇచ్చారు.



నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

ఎల్‌నినో కరువు ప్రభావంపై కేంద్రం తక్షణమే స్పందించాలి

ములుగు జిల్లా /వెంకటాపురం, అక్టోబర్ 19 (నిత్యం నిఘా ప్రతినిధి): ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడి రైతులు, పేద ప్రజలు, ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజనులు, వెనుకబడిన వర్గాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఏజెన్సీ నేతకాని హక్కుల పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ ఉద్యమకారుడు, సామాజిక కార్యకర్త జాడి ఈశ్వర్ నేతకాని అన్నారు. కరువు ప్రభావంపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతులు, కూలీలు, పేద కుటుంబాలకు సహాయక చర్యలు ప్రకటించాలని డిమాండ్ చేశారు.ఈ మేరకు సోమవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆయన పలు డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం ముందుంచారు.ప్రధాన డిమాండ్లు ఇవే..- పంట నష్టపరిహారం: వర్షాభావంతో దెబ్బతిన్న పంటలకు హెక్టారుకు తగిన పరిహారం వెంటనే అందించాలి.- రుణమాఫీ: కరువు బారిన పడిన రైతుల పంట రుణాలను పూర్తిగా మాఫీ చేయాలి లేదా దీర్ఘకాలిక రుణాలుగా రీషెడ్యూల్ చేయాలి.- కరువు భత్యం: ఉపాధి కోల్పోయిన పేద కుటుంబాలు, కూలీలకు నెలకు రూ.5,000 చొప్పున కరువు భత్యాన్ని నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలి.- నిత్యావసరాల పంపిణీ: రేషన్ ద్వారా అదనపు ఆహార ధాన్యాలు, నిత్యావసర సరుకులను ఉచితంగా పంపిణీ చేయాలి.- ఉపాధి హామీ పనిదినాల పెంపు: గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతాల నుంచి వలసలను నివారించేందుకు ఉపాధి హామీ పథకం కింద పనిదినాలను 200 రోజులకు పెంచి, కూలీ డబ్బులను వారంలోపు చెల్లించాలి.- తాగునీరు, పశుగ్రాసం: తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక నిధులు కేటాయించడంతో పాటు పశువుల సంరక్షణ కోసం మండలాల వారీగా ఉచిత పశుగ్రాస కేంద్రాలను ఏర్పాటు చేయాలి.ఎల్‌నినో ప్రభావం కేవలం వాతావరణ సమస్య మాత్రమే కాదని, ప్రజల ఉపాధి, ఆహారం, జీవనాధారాలపై ప్రభావం చూపే సామాజిక, ఆర్థిక సమస్య అని జాడి ఈశ్వర్ నేతకాని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం కాలయాపన చేయకుండా తెలంగాణను కరువు



పీడిత ప్రాంతంగా గుర్తించి ప్రత్యేక నిధుల ప్యాకేజీ ప్రకటించాలని కోరారు.ప్రభుత్వం స్పందించి తక్షణ చర్యలు చేపట్టకపోతే రైతులు, ప్రజా సంఘాలతో కలిసి ఆందోళనను ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

ఆసుపత్రిలో వైద్య సేవలు వేగవంతం కావాలి

- **రోగులు ఎక్కువసేపు వేచి ఉండకుండా చర్యలు తీసుకోవాలి**
- **వెల్‌నెస్ సెంటర్ ఆకస్మిక తనిఖీలో కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ఆదేశాలు**

హన్మకొండ, అక్టోబర్ 19 (నిత్యం నిఘా ప్రతినిధి): హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి (జీఎంహెచ్) ప్రాంగణంలో కొనసాగుతున్న వెల్‌నెస్ సెంటర్‌ను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో అందుతున్న వైద్య సేవలు, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలు, పారిశుధ్య నిర్వహణ తీరును ఆమె పరిశీలించారు.ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, ప్రాంగణంలో పారిశుధ్యాన్ని మరింత మెరుగు పరచాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రిజిస్ట్రేషన్, మందుల పంపిణీ కౌంటర్ల వద్ద రోగులు ఎక్కువసేపు వేచి ఉండాల్సిన పరిస్థితి రాకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.రోగుల వివరాల నమోదు, మందుల పంపిణీకి సంబంధించిన ఆన్‌లైన్ డేటా ఎంట్రీ ప్రక్రియలో జాప్యం జరగకుండా వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. డేటా ఎంట్రీ సజావుగా సాగేందుకు ప్రస్తుతం ఉన్న కంప్యూటర్లు సరిపోకపోతే అదనపు కంప్యూటర్ వ్యవస్థలను



వెంటనే ఏర్పాటు చేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వైద్య సేవలను వేగవంతంగా, పారదర్శకంగా అందించడమే లక్ష్యంగా అధికారులు, సిబ్బంది పనిచేయాలని కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ఆదేశించారు.

కాటాపూర్‌లో కల్లుగీత కార్మిక సంఘం 69వ వార్షికోత్సవం

ములుగు జిల్లా /తాడ్వాయి, అక్టోబర్ 19 (నిత్యం నిఘా ప్రతినిధి): ములుగు జిల్లా తాడ్వాయి మండల పరిధిలోని కాటాపురం గ్రామంలో కల్లుగీత కార్మిక సంఘం 69వ వార్షికోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కాటాపురం కల్లుగీత కార్మికుల సొసైటీ అధ్యక్షుడు రంగు సత్యనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా గౌరవ అధ్యక్షుడు పులి చిన్న నరసయ్య గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా రంగు సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ అర్హులైన గీత కార్మికులకు ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గీత కార్మికులకు ప్రమాదాలు జరిగినప్పుడు బీమా పథకం సక్రమంగా అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.తాటికల్లును వినియోగించే వారి సంఖ్య తగ్గడంతో గీత కార్మికుల జీవనోపాధి దెబ్బతింటోందని అన్నారు. మరోవైపు అక్రమంగా గుడుంబా తయారు చేస్తున్నవారు ప్రభుత్వానికి పన్నులు చెల్లించకుండా ఆదాయం పొందుతుండగా, నిబంధనల ప్రకారం పన్నులు చెల్లిస్తున్న గీత కార్మికులు నష్టాలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ పరిస్థితిపై ఆబ్కారీ శాఖ అధికారులు స్పందించాలని ప్రశ్నించారు.గీత కార్మికుల సమస్యలను ప్రభుత్వం, సంబంధిత అధికారులు తక్షణమే పరిష్కరించాలని కోరారు. అక్రమ గుడుంబా తయారీని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో గీత కార్మికులు జీవనోపాధి కోల్పోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు: ఉప



సర్పంచ్ వెంకట్రాం నరసయ్య గౌడ్, జిల్లా గౌరవ అధ్యక్షుడు పులి చిన్న నరసయ్య గౌడ్, సొసైటీ అధ్యక్షుడు రంగు సత్యనారాయణ గౌడ్, గీత కార్మికుల మండల అధ్యక్షుడు గండు సదయ్య గౌడ్, పాలకుర్తి మధు గౌడ్, పాలకుర్తి జగ్గులు గౌడ్, గడ్డం శ్రీధర్ గౌడ్, గడ్డం రవికిరణ్ గౌడ్, గండు సదానందం గౌడ్, బెల్లంకొండ నగేష్ గౌడ్, గట్టు రాజు గౌడ్, గట్టు నరేష్ గౌడ్, గడ్డం రాములు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

లింగాల గ్రామపంచాయతీ పరిధిలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

- **ఆడపడుచులకు చీరల పంపిణీ చేసిన సర్పంచ్ మొగిలిపల్లి రవీందర్**

ములుగు జిల్లా / తాడ్వాయి, అక్టోబర్ 19 (నిత్యం నిఘా ప్రతినిధి): ములుగు జిల్లా తాడ్వాయి మండల పరిధిలోని లింగాల గ్రామపంచాయతీకి చెందిన బోటిలింగాల, ఒడ్డుగూడెం గ్రామాల్లో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా లింగాల గ్రామ సర్పంచ్ మొగిలిపల్లి రవీందర్ హాజరై ఆడపడుచులకు చీరలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మొగిలిపల్లి రవీందర్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను అలంకరించి,



ప్రత్యేక పూజలు నిర్వహించడం మన పూర్వీకుల నుంచి వస్తున్న ఆనవాయితీ అని పేర్కొన్నారు.ఒకప్పుడు తెలంగాణకే పరిమితమైన బతుకమ్మ వేడుకలు నేడు విదేశాల్లో నివసిస్తున్న తెలుగు ప్రజలు సైతం ఘనంగా నిర్వహిస్తున్నారని, ఇది పండుగకు లభించిన విశేష ప్రాచుర్యానికి నిదర్శనమని అన్నారు. తెలంగాణ ప్రజల



జీవన విధానం, ఆచార సంప్రదాయాలను బతుకమ్మ పాటల రూపంలో ప్రతిబింబించడం గర్వకారణమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు: గ్రామ కార్యదర్శి మోడం రాజేష్, వార్డు సభ్యులు చేపల సురేష్, కోరెం రంజిత్ కుమార్, ఊకె ప్రకాష్, ఊసెం స్వరూప, మంకిడి నాగేశ్వరరావు, మంకిడి జగన్, పోలేబోయిన అనురాధతో పాటు వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మడికొండ పట్టణ ప్రజలకు దసరా శుభాకాంక్షలు

- **GWMC 64వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు దువ్వ శ్రీకాంత్**



హన్మకొండ, అక్టోబర్ 19 (నిత్యం నిఘా ప్రతినిధి): విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని మడికొండ పట్టణ ప్రజలకు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (GWMC) 64వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దువ్వ శ్రీకాంత్ దసరా శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయదశమి చెడుపై మంచి, అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. మహిషాసురుడిపై దుర్గాదేవి సాధించిన విజయం, రావణుడిపై శ్రీరాముడు సాధించిన విజయాన్ని ఈ పర్వదినం గుర్తుచేస్తుందని అన్నారు. సత్యం, ధర్మం, న్యాయం పట్ల నిబద్ధతతో జీవించాలనే సందేశాన్ని దసరా పండుగ అందిస్తుందని తెలిపారు.ప్రజల జీవితాల్లో విజయానికి, శుభారంభాలకు దసరా ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. చెడును విడనాడి, మంచి మార్గంలో పయనిస్తూ సమాజ శ్రేయస్సుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. పండుగలు ప్రజల మధ్య ఐక్యత, సోదరభావాన్ని పెంపొందిస్తాయని అన్నారు. దసరా పండుగ ప్రతి కుటుంబంలో సంతోషం, సిరిసంపదలు నింపాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా మడికొండ పట్టణ ప్రజలందరికీ దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పోలు సతీష్ కుమార్, ముద్దమల్ల రమేష్, చౌనబోయిన కుమార్, పసునూరి భాస్కర్, పులి కిరణ్ తదితరులు పాల్గొని పట్టణ ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు.

మహిషాసురమర్దినిగా భద్రకాళీ అమ్మవారి దర్శనం



వరంగల్ / భద్రకాళీ ఆలయం , అక్టోబర్ 19 (నిత్యం నిఘా ప్రతినిధి): వరంగల్ శ్రీ భద్రకాళీ దేవస్థానంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు తొమ్మిదో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సోమవారం అమ్మవారిని మహిషాసురమర్దినిగా అలంకరించి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శనం కోసం సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు.ఉదయం నాలుగు గంటలకు నిత్యాహ్నికం అనంతరం అమ్మవారిని మహిషాసురమర్దిని అలంకారంలో తీర్చిదిద్దారు. వరాహ పురాణం ప్రకారం సిద్ధిధాత్రి దుర్గాక్రమంలో, బోధాయనోక్త నవరాత్రి కల్పం ప్రకారం శుంభహ దుర్గాక్రమంలో పూజారాధనలు నిర్వహించారు. ఉదయం వసంతోత్సవం, చతురంత సేవతో పాటు సాయంత్రం సర్వభూపాల వాహనంపై విమానక సేవను అత్యంత వైభవంగా నిర్వహించారు.సోమవారం ఉత్సవాలకు గోవా రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విశ్వజిత్ రాణే, దేవ్యా రాణే, ఎమ్మెల్యే ఐశ్వర్య రాణే, అరుంధతి రాణే తదితరులు ఉభయదాతలుగా వ్యవహరించారు. కలీంనగర్‌కు చెందిన యాదా సత్యదీప్–ప్రవళిక దంపతులు, యాదా రూహి తదితరులు కూడా ఉభయదాతలుగా పాల్గొన్నారు.తెలంగాణ రాష్ట్ర మత్స్య అభివృద్ధి సంస్థ చైర్మన్ మెట్టు సాయి సహా పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. పూజల అనంతరం ప్రధానార్చకులు భద్రకాళీ శేషు మహదాశీర్వచనం అందించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో దేవస్థాన ధర్మకర్తలు కమటం వేణుగోపాల్, గాదె శ్రవణ్ కుమార్ రెడ్డి, మోతుకూరి మయూరి రామేశ్వరరావు, చిదర అంజనీదేవి, కల్లూరి పవన్ కుమార్, కారెంగుల సురేష్ బాబు, మాడిశెట్టి సతీష్ తదితరులు పాల్గొన్నారు.మంగళవారం ఉదయం నవరాత్రి మహోత్సవాల పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు దేవస్థాన కార్యనిర్వహణాధికారి రామల సునీత తెలిపారు.

విశ్వనాథ కాలనీలో రావణ వధకు ఏర్పాట్లు

- **కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాలనీ అధ్యక్షుడు కర్నె రవీందర్ పిలుపు**

వరంగల్, అక్టోబర్ 19 (నిత్యం నిఘా ప్రతినిధి): వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని 41వ డివిజన్ విశ్వనాథ కాలనీలో దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని రావణ వధ కార్యక్రమానికి ఏర్పాట్లు చేస్తున్నారు. గత 15 ఏళ్లుగా కొనసాగుతున్న ఈ సంప్రదాయాన్ని ఈ ఏడాది కూడా ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు సిద్ధమవుతున్నారు.కాలనీలో మూడు అడుగుల రావణ ప్రతిమను అందంగా అలంకరించి, మంగళవారం నిర్వహించనున్న కార్యక్రమానికి ఏర్పాట్లు చేస్తున్నారు. మట్టివాడ వర్షిత్, గందె గణ, మాడిశెట్టి మెట్టు శివసాయి సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా 41వ డివిజన్ ప్రజలకు కాలనీ అధ్యక్షుడు కర్నె రవీందర్ దసరా శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా నాయకులు, అధికారులు, డివిజన్ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని రావణ వధ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.



నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

భూపాలపల్లి పోలీస్ కార్యాలయంలో ఘనంగా ఆయుధ, వాహన పూజలు

- జిల్లా ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్



భూపాలపల్లి, అక్టోబర్ 19 (నిత్యం నిఘా ప్రతినిధి): విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని భూపాలపల్లి జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఆయుధ, వాహన పూజలను ఘనంగా నిర్వహించారు. జిల్లా పోలీస్ అధికారి సిరిశెట్టి సంకీర్త్ ఆధ్వర్యంలో సాయుధ రిజర్వు విభాగంలోని ఆయుధాలకు, మోటారు రవాణా విభాగంలోని పోలీస్ వాహనాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు, పోలీస్ సిబ్బందికి, వారి కుటుంబ సభ్యులకు ఎస్పీ విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విజయదశమి చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అని పేర్కొన్నారు. ఈ పర్వదినం ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతిసౌభాగ్యాలు నింపాలని ఆకాంక్షించారు. ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని, పండుగను ప్రశాంత వాతావరణంలో ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కోరారు.ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణతోపాటు జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ నిరంతరం అప్రమత్తంగా ఉంటుందని స్పష్టం చేశారు. నేరాల నియంత్రణ, ప్రజల భద్రత, అత్యవసర సమయాల్లో సత్వర సేవలు అందించడంలో పోలీస్ ఆయుధాలు, వాహనాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. పోలీస్ అధికారులు, సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని సూచించారు.ప్రజల సహకారంతో జిల్లాలో శాంతి భద్రతలను పటిష్టంగా కొనసాగిస్తూ, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి సమర్థవంతమైన సేవలు అందించేందుకు జిల్లా పోలీస్ శాఖ కట్టుబడి ఉందని ఎస్పీ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ నరేష్ కుమార్, ప్రత్యేక విభాగం సీఐ నరేష్, భూపాలపల్లి పట్టణ సీఐ శ్రీనివాస్, రిజర్వు ఇన్స్పెక్టర్లు సంతోష్, రత్నం, పూర్ణచందర్‌తోపాటు పలువురు పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ములుగు పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఘనంగా ఆయుధ పూజ

- జిల్లా ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన ఎస్పీ కేకాన్ సుధీర్ రామ్నాథ్



ములుగు జిల్లా , అక్టోబర్ 19 (నిత్యం నిఘా ప్రతినిధి): విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని ములుగు జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో సోమవారం ఆయుధ పూజ కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ కేకాన్ సుధీర్ రామ్నాథ్ ఆధ్వర్యంలో పోలీస్ శాఖ విధి నిర్వహణలో ఉపయోగించే ఆయుధాలు, వాహనాలకు ప్రత్యేక పూజలు చేశారు.ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణలో నిరంతరం సేవలందించే పోలీస్ సిబ్బంది క్షేమంగా ఉండాలని, జిల్లా ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఈ సందర్భంగా ప్రార్థించారు. జిల్లా పోలీస్ శాఖ తరపున ఎస్పీ ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల ధన, మాన, ప్రాణ రక్షణే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణతోపాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు పోలీస్ సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహించాలని సూచించారు. పండుగల సమయంలో ప్రజలు ప్రశాంత వాతావరణంలో వేడుకలు జరుపుకునేలా పోలీస్ శాఖ నిరంతరం అప్రమత్తంగా ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం అదనపు ఎస్పీ మనన్ భట్, అదనపు ఎస్పీ సదానందం, జిల్లా నేర పరిశోధన విభాగం డీఎస్పీ కిషోర్ కుమార్, ములుగు డీఎస్పీ నలువాల రవీందర్, ములుగు సీఐ దారం సురేష్, పరిపాలనా విభాగం రిజర్వు ఇన్స్పెక్టర్ స్వామి, కార్యాచరణ విభాగం రిజర్వు ఇన్స్పెక్టర్ తిరుపతి, మోటారు రవాణా విభాగం రిజర్వు ఇన్స్పెక్టర్ వెంకటనారాయణ, హోంగార్డులు, సంక్షేమ విభాగం రిజర్వు ఇన్స్పెక్టర్ శ్రీకాంత్, ములుగు ఎస్ఐ వెంకటేశ్వర్లు, వెంకటాపురం ఎస్ఐ చల్లా రాజు, ఎస్ఐలు తాజుద్దీన్, కృష్ణ ప్రసాద్‌తోపాటు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా భారీగా బాణాసంచా నిల్వ

హన్మకొండ, అక్టోబర్ 19(నిత్యం నిఘా ప్రతినిధి): పండుగల సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా బాణాసంచా నిల్వ ఉంచిన వ్యక్తిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. ఈ ఘటన హసన్‌పర్తి మండలం నాగారం గ్రామంలో చోటుచేసుకుంది.నాగారం గ్రామంలోని ఓ నివాసంలో భారీగా బాణాసంచా నిల్వ ఉంచినట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు సదరు నివాసంపై ఆకస్మికంగా దాడి చేసి తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో రూ.4,22,067 విలువైన వివిధ రకాల బాణాసంచాను స్వాధీనం చేసుకున్నారు.ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా నివాస ప్రాంతంలో బాణాసంచా నిల్వ ఉంచినట్లు గుర్తించిన పోలీసులు, రంజిత్ (38) అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం నిందితుడితో పాటు స్వాధీనం చేసుకున్న బాణాసంచాను తదుపరి చర్యల నిమిత్తం హసన్‌పర్తి పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అనుమతులు తప్పనిసరి

నివాస ప్రాంతాల్లో అనుమతులు లేకుండా ప్రమాదకరమైన బాణాసంచా, పేలుడు పదార్థాలను నిల్వ ఉంచితే చట్టప్రకారం



కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. బాణాసంచా వ్యాపారులు సంబంధిత అధికారుల నుంచి తప్పనిసరిగా అనుమతులు పొందిన తర్వాతే నిల్వలు ఉంచాలని స్పష్టం చేశారు.

నీట్‌లో 1457వ ర్యాంకు సాధించిన ఇర్ప సాహితికి ఘన సన్మానం

ములుగు జిల్లా /తాడ్వాయి, అక్టోబర్ 19 (నిత్యం నిఘా ప్రతినిధి): ములుగు జిల్లా తాడ్వాయి మండల పరిధిలోని రంగాపురం గ్రామపంచాయతీకి చెందిన మారుమూల గ్రామం కొత్తపల్లిలో సాధారణ మధ్యతరగతి రైతు కుటుంబంలో జన్మించిన ఇర్ప సాహితి నీట్ పరీక్షలో 1457వ ర్యాంకు సాధించి సిద్ధిపేట జిల్లా వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సంపాదించింది. ఈ సందర్భంగా రంగాపురం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆమెను ఘనంగా సన్మానించారు.కొత్తపల్లి గ్రామానికి చెందిన ఇర్ప ఈశ్వరి, నారాయణ దంపతుల కుమార్తె సాహితి తన కృషి, పట్టుదలతో వైద్య విద్యలో ప్రవేశం సాధించి గ్రామానికి గర్వకారణంగా నిలిచింది. ఆమె తల్లి రంగాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎంగా పనిచేస్తుండగా, తండ్రి



నారాయణ వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. తమ కుమార్తె సాధించిన విజయంపై తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.గ్రామపంచాయతీ కార్యదర్శి రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సన్మాన కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ ఇర్ప శివ ముఖ్య అతిథిగా హాజరై సాహితిని శాలువాతో సత్కరించి అభినందించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ నీట్‌లో మంచి ర్యాంకు



సాధించి వైద్య విద్యలో సీటు సంపాదించడం అభినందనీయమని అన్నారు. ఈ విజయంతోనే ఆగిపోకుండా భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి, మంచి వైద్యురాలిగా ఎదిగి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఇర్ప శివ, కార్యదర్శి రవికుమార్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దళిత మహిళా సర్పంచ్‌ను కులం పేరుతో అవమానించారంటూ ఫిర్యాదు

- బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం కింద కేసు నమోదు చేయాలి
- వెంకటాపూర్ ఎస్సైకి దళిత, ప్రజాసంఘాల నాయకుల వినతి

ములుగు జిల్లా/ వెంకటాపూర్, అక్టోబర్ 19 (నిత్యం నిఘా ప్రతినిధి): బతుకమ్మ వేడుకల్లో దళిత మహిళా సర్పంచ్‌ను కులం పేరుతో అవమానించారంటూ ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ ఘటనకు బాధ్యులుగా పేర్కొంటున్న వారిపై విచారణ జరిపి, ఎస్సీ, ఎస్టీ (అట్రాసిటీ నిరోధక) చట్టం కింద కేసు నమోదు చేయాలని దళిత, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు.ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన దళిత మహిళా సర్పంచ్ మడిపెల్లి రాజేశ్వరిని బతుకమ్మ ఆడుతున్న సమయంలో కొందరు మహిళలు కులం పేరుతో అవమానించారని నాయకులు ఆరోపించారు. “నువ్వు మాదిగ దానివి.. మాతో కలిసి ఆడవద్దు.. వేరే చోట ఆడుకో” అంటూ ఆమెను అవమానించారని పేర్కొన్నారు. సర్పంచ్‌గా ఎన్నికైనప్పటికీ కులం పేరుతో వివక్ష చూపడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ ఘటనపై సోమవారం దళిత, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో వెంకటాపూర్ ఎస్సై చల్లా రాజుకు వినతిపత్రం అందజేశారు. ఫిర్యాదుపై సమగ్ర విచారణ చేపట్టి, వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. కులం పేరుతో దళిత ప్రజాప్రతినిధులను అవమానించడం సామాజిక సమానత్వానికి, ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. ఇలాంటి ఘటనలు



పునరావృతం కాకుండా పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధితురాలికి న్యాయం చేయాలని కోరారు.దళితుల ఆత్మగౌరవానికి భంగం కలిగించే చర్యలను సహించబోమని, బాధితురాలికి న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో దళిత, ప్రజాసంఘాల నాయకులు జన్ను రవి, బొమ్మకంటి రమేష్, మట్టవాడ తిరుపతి, రత్నం రాజేందర్, మైస ప్రభాకర్, నెమలి నరసయ్య, కాడపాక శ్యామ్, రత్నం ప్రవీణ్, నక్క బిక్షపతి, బీరెల్లి రవి రాజా, మడిపల్లి కుమార్, పసుల సాగర్, మారపల్లి సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజల జీవితాల్లో విజయోత్సాహం నింపాలి దసరా

ములుగు జిల్లా , అక్టోబర్ 19 (నిత్యం నిఘా ప్రతినిధి): విజయదశమి పర్వదినం ప్రజల జీవితాల్లో నూతనోత్సాహాన్ని, విజయోత్సాహాన్ని నింపాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు మూల వెంకన్న గౌడ్ ఆకాంక్షించారు. దసరా పండుగను పురస్కరించుకుని ములుగు జిల్లా ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.చెడుపై మంచి, అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి దసరా పండుగ ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ పర్వదినం ప్రతి ఇంటా సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం వెల్లివిరిసేలా చేయాలని ఆకాంక్షించారు. రైతులు పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని, యువతకు ఉజ్వల భవిష్యత్తు లభించాలని, పేదలు, మహిళల జీవితాల్లో అభివృద్ధి వెలుగులు నిండాలని కోరుకున్నారు.ప్రజలంతా కులమతాలకు అతీతంగా ఐకమత్యంతో మెలుగుతూ, పరస్పర గౌరవం, సోదరభావంతో సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. దసరా స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొంటూ విజయపథంలో ముందుకు సాగాలని అన్నారు. ములుగు జిల్లా అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించి, ప్రజల జీవితాల్లో సంతోషం వెల్లివిరియాలని మూల వెంకన్న గౌడ్ ఆకాంక్షించారు.



నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

యువతకు స్ఫూర్తినిచ్చే క్రీడలు

- **క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు అందజేసిన ఈగ మల్లేశం**

వరంగల్/ వర్ధన్నపేట, అక్టోబర్ 19 (నిత్యం నిఘా ప్రతినిధి): యువత చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని కేంద్ర ఖాదీ, చిన్న పరిశ్రమల మాజీ డైరెక్టర్ ఈగ మల్లేశం అన్నారు.వర్ధన్న పేట మున్సిపాలిటీ పరిధిలోని డీసీ తండా దుర్గమ్మ ఆలయ ప్రాంగణంలో సేవాలాల్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా పోటీల్లో విజయం సాధించిన జట్లకు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా ఈగ మల్లేశం మాట్లాడుతూ క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంపొందించడంతోపాటు మానసిక



ఉల్లాసాన్ని కలిగిస్తాయని పేర్కొన్నారు. యువతలో అపారమైన ప్రతిభ దాగి ఉంటుందని, గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని వెలికితీయడానికి ఇలాంటి పోటీలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు.క్రీడల్లో క్రమశిక్షణ, పట్టుదల, జట్టుగా పనిచేసే మనస్తత్వం అలవడతాయని తెలిపారు. యువత క్రీడా స్ఫూర్తితో



ముందుకు సాగుతూ ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు క్రికెట్ పోటీలను నిర్వహించిన సేవాలాల్ యూత్ సభ్యులను అభినందించారు.అనంతరం నిర్వాహకులు ఈగ మల్లేశంను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కరిమిల్ల సంపత్ రావు, భూషబోయిన సంపత్ యాదవ్, శ్రీనివాస్ నాయక్, భాస్కర్‌తోపాటు యువత, క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దుర్గామాత విగ్రహాల నిమజ్జనానికి ఏర్పాట్లు చేయాలి

- **జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్నకు 40వ డివిజన్ మాజీ కార్పొరేటర్ మరుపల్ల రవి వినతి**

వరంగల్, అక్టోబర్ 19 (నిత్యం నిఘా ప్రతినిధి): దసరా పండుగ సందర్భంగా దుర్గామాత విగ్రహాల నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని 40వ డివిజన్ మాజీ కార్పొరేటర్ మరుపల్ల రవి వరంగల్ మహా నగర పాలక సంస్థ కమిషనర్ వెంకన్నను కోరారు. నిమజ్జన ప్రాంతంలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయడంతోపాటు పారిశుద్ధ్య చర్యలు చేపట్టి భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.వరంగల్ అండర్ రైల్వే గేట్ ప్రాంతంలో భక్తులు వందలాది మండపాలను ఏర్పాటు చేసుకుని గత తొమ్మిది రోజులుగా దుర్గామాతకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఈ నెల 21వ తేదీ బుధవారం మండపాల నుంచి మేళతాళాలతో ఊరేగింపుగా బయలుదేరి విగ్రహాలను చెరువులో నిమజ్జనం చేయనున్నారు.అయితే, గతంలో వినాయక చవితి సందర్భంగా విగ్రహాల నిమజ్జనం జరిగిన ప్రాంతం విగ్రహాలతో నిండిపోవడంతో కొత్తగా తీసుకువచ్చే విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేయడంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని మరుపల్ల రవి పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రిజిస్ట్రేషన్ కార్యాలయం సమీపంలోని డీకే నగర్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన గణేష్ సాగర్‌లో నిమజ్జనానికి అనువైన ఏర్పాట్లు చేయాలని కోరారు.గణేష్ సాగర్ పరిసరాల్లో చెత్తాచెదారాన్ని తొలగించి, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయడంతోపాటు భక్తులకు అవసరమైన



సౌకర్యాలు కల్పించాలని కమిషనర్‌కు విన్నవించారు. దీనిపై కమిషనర్ వెంకన్న స్పందిస్తూ అవసరమైన ఏర్పాట్లకు కృషి చేస్తానని తెలిపినట్లు మరుపల్ల రవి వెల్లడించారు.

మంథని అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధం

పెద్దపల్లి జిల్లా/మంథని, అక్టోబర్ 19 (నిత్యం నిఘా ప్రతినిధి):మంథని మున్సిపాలిటీలో చెత్త కుంభకోణం జరిగిందంటూ మాజీ జడ్పీ చైర్మన్ పుట్ట మధు చేసిన ఆరోపణలను మున్సిపల్ చైర్మన్ వొడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముసుకుల సహేందర్ రెడ్డి ఖండించారు. మున్సిపల్ పాలకవర్గంపై ఆరోపణలు చేయడం మానుకుని పట్టణ అభివృద్ధి, చేపట్టిన పనులపై బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. సోమవారం మంథని మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిలర్లతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.పండుగల నిర్వహణకు ప్రత్యేక శ్రద్ధ,మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో మున్సిపల్ సిబ్బంది సమన్వయంతో వినాయక చవితి, సద్దుల బతుకమ్మ, దసరా పండుగలను ఘనంగా నిర్వహించామని చైర్మన్ శ్రీనివాస్ తెలిపారు. పట్టణంలో విద్యుత్ దీపాలంకరణ, పారిశుద్ధ్య ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించామని, రాత్రివేళల్లోనూ అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో పనిచేశారని పేర్కొన్నారు. వాస్తవ పరిస్థితులను తెలుసుకోకుండా ఆరోపణలు చేయడం సరికాదన్నారు.తమ్మిచెరువు పనులు మధ్యలోనే ఎందుకు ఆగాయి?తమ్మిచెరువు అభివృద్ధి పనులపై స్పందిస్తూ, గతంలో సుమారు రూ.3.15 కోట్ల పనులకు అనుమతులు వచ్చినప్పటికీ అవి పూర్తిస్థాయిలో ఎందుకు పూర్తికాలేదని ప్రశ్నించారు. కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే నిలిపివేయడానికి గల కారణాలను పుట్ట మధు ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. గతంలో చేపట్టిన పనుల పరిస్థితిని పరిశీలించిన తర్వాతే ప్రస్తుత పాలకవర్గంపై విమర్శలు చేయాలని సూచించారు.

మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో అభివృద్ధి

మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో మంథని పట్టణాన్ని ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని వొడ్నాల శ్రీనివాస్ తెలిపారు. ప్రభుత్వ పథకాల అమలులో అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా వ్యవహరిస్తున్నామని పేర్కొన్నారు. ఇళ్ల నిర్మాణ అనుమతులు, ఇంటి నంబర్లు, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, కల్యాణలక్ష్మి పథకాల విషయంలో లబ్ధిదారుల నుంచి ఒక్క రూపాయి కూడా వసూలు చేయడం లేదని స్పష్టం చేశారు. ఎరుకలగూడెంలో 40 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిన విషయాన్ని గుర్తుచేశారు.

పుష్కర ఘాట్ అభివృద్ధికి ప్రణాళికలు

మంథని గోదావరి పుష్కర ఘాట్‌ను విజయవాడ, రాజమండ్రి ఘాట్ల తరహాలో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. పట్టణంలో మౌలిక



సదుపాయాలను మెరుగుపరచడమే తమ లక్ష్యమన్నారు. కాళేశ్వరం ప్రాంత అభివృద్ధికి అవసరమైన నిధులు తీసుకురావడానికి మంత్రి శ్రీధర్ బాబు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

ఎక్కడికి రమ్మన్నా చర్చకు సిద్ధం

మంథని అభివృద్ధి, మున్సిపాలిటీ పనితీరు, తమ్మిచెరువు అభివృద్ధి అంశాలపై పుట్ట మధు ఎక్కడికి రమ్మన్నా బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామని చైర్మన్ వొడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముసుకుల సహేందర్ రెడ్డి స్పష్టం చేశారు. ఆరోపణలు, విమర్శలకే పరిమితం కాకుండా వాస్తవాల ఆధారంగా చర్చించాలని సూచించారు. పట్టణంలో చేపట్టే అభివృద్ధి పనుల ద్వారా తమ పాలనలోని ప్రగతిని ప్రజలకు చూపిస్తామని వారు తెలిపారు.ఈ సమావేశంలో కౌన్సిలర్లు ఎల్లంకి వంశీ, జొంబోజు శ్రీమతి, మారుపాక నిహారిక, పెంటరి రాజు, ఎరుకల స్రవంతి, కుర్ర లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా సుఖసంతోషాలు వెల్లివిరియాలి

ములుగు జిల్లా , అక్టోబర్ 19 (నిత్యం నిఘా ప్రతినిధి):చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి పర్వదినమని ములుగు జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు. దసరా పండుగ జిల్లా ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని, ప్రతి ఇంటా సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా ప్రజలందరికీ కలెక్టర్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని కోరుకున్నారు. ప్రజల మధ్య ప్రేమాభిమానాలు, ఐకమత్యం మరింత బలపడాలని, అందరూ సోదరభావంతో కలిసిమెలిసి జీవించాలని ఆకాంక్షించారు



హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం



పెద్దపల్లి జిల్లా/మంథని, అక్టోబర్ 19 (నిత్యం నిఘా ప్రతినిధి): తెలంగాణ ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ గంగాపురి నాయకుడు తాటి రమేష్ గౌడ్ విమర్శించారు. మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం అందిస్తామని, బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తామని ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించడం సరికాదన్నారు.రైతులకు సాగునీరు, నిరంతర విద్యుత్ అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అమలైన రైతుబంధు పథకం ద్వారా మూడో పంటకు కూడా పెట్టుబడి సాయం అందించాలని డిమాండ్ చేసిన నాయకులు, ప్రస్తుతం ఒక పంటకే పరిమితం కావాలని చెబుతున్నారని విమర్శించారు. గతంలో చేసిన వ్యాఖ్యలకు, ప్రస్తుత వైఖరికి సంబంధించి ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఇష్టానుసారంగా మాట్లాడితే తెలంగాణ ప్రజలు చూస్తూ ఊరుకోరని రమేష్ గౌడ్ అన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించి, ఎన్నికల హామీలను నెరవేర్చడంపై ప్రభుత్వం దృష్టి సారించాలని సూచించారు. రాబోయే రోజుల్లో ప్రజలు ఓటు ద్వారా తమ నిర్ణయాన్ని వెల్లడిస్తారని ఆయన పేర్కొన్నారు.

గ్రామీణాభివృద్ధికి నా వంతు సహకారం అందిస్తా



పెద్దపల్లి జిల్లా/మంథని, అక్టోబర్ 19 (నిత్యం నిఘా ప్రతినిధి):తెలంగాణలో గ్రామీణాభివృద్ధి పరిపూర్ణంగా జరిగేందుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ జాయింట్ సెక్రటరీ, ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి తెలిపారు. పెద్దపల్లి జిల్లా మంథని మండలం విలోచవరం గ్రామంలో గ్రామ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహా చండీయాగంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.విలోచవరం గ్రామంలోని శ్రీ మల్లికార్జున స్వామి ఆలయం, శ్రీ కోదండ రామాలయంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కావేటి రవికుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామానికి చేరుకున్న నరహరికి గ్రామస్తులు, భవానీ దీక్షలు స్వీకరించిన భక్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం మహా చండీ యాగంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.దేవీ నవరాత్రుల సందర్భంగా భవానీ దీక్ష స్వీకరించిన నేపథ్యంలో గ్రామీణ వాతావరణంలో గ్రామస్తులతో కలిసి యాగంలో పాల్గొనడం ఆనందంగా ఉందని నరహరి తెలిపారు. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడం పంటల దిగుబడిపై ప్రభావం చూపిందని పేర్కొన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు చెప్పారు.కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ జాయింట్ సెక్రటరీగా తన పరిధిలో గ్రామీణ ప్రాంతాలకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తెలంగాణలో గ్రామీణ ప్రాంతాలు మరింత అభివృద్ధి చెందేలా తన వంతు ప్రయత్నం చేస్తానని స్పష్టం చేశారు.అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో నరహరి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొండ రవీందర్, శ్రీ కోదండ రామాలయ కమిటీ అధ్యక్షుడు కావేటి రవికుమార్ యాదవ్, పోతారం మాజీ సర్పంచ్ జాగిరి సదానందం, ఆలయ ఫౌండేషన్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మంత్రపురి సాయిబాబా ఆలయ అభివృద్ధికి రూ.10 లక్షల సాయం కోరిన కమిటీ



పెద్దపల్లి జిల్లా /మంథని, అక్టోబర్ 19 (నిత్యం నిఘా ప్రతినిధి):పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలోని తమ్మిచెరువు కట్టపై ఉన్న మంత్రపురి శ్రీ షిరిడీ సాయిబాబా దేవాలయ అభివృద్ధికి సహకరించాలని ఆలయ కమిటీ ప్రతినిధులు రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును కోరారు.ఆలయ కమిటీ అధ్యక్షురాలు మహావాది జలజ సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు పనకంటి మురళీధర్, అర్చకులు రామడుగు సాయి శ్రీనివాస్ ఆలయ అభివృద్ధికి అవసరమైన పనులను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గత 36 ఏళ్లుగా ఆలయంలో నీటి సమస్య ఉందని, దీనిని పరిష్కరించేందుకు బోరు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.అలాగే ఒరిగిపోయిన ఆలయ గోడను పునర్నిర్మించడంతో పాటు ఆలయం చుట్టూ దెబ్బతిన్న బండలను మరమ్మతు చేయాలని, భక్తుల సౌకర్యార్థం ముఖద్వారాన్ని నిర్మించేందుకు ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఈ పనులన్నింటికీ సుమారు రూ.10 లక్షలు అవసరమవుతాయని తెలిపారు.ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ఆలయాల అభివృద్ధికి మంత్రి శ్రీధర్‌బాబు అందిస్తున్న ప్రోత్సాహం పట్ల మంథని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని ఆలయ కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేసి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

నిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధితుడికి రూ.2.50 లక్షల ఎల్ఓసీ



వరంగల్ / పర్వతగిరి, అక్టోబర్ 19 (నిత్యం నిఘా ప్రతినిధి):అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పర్వతగిరి మండల కేంద్రానికి చెందిన సిరి ఫోటో స్టూడియో నిర్వాహకుడు రాజుకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.2.50 లక్షల ఎల్ఓసీ మంజూరైంది. పర్వతగిరి పట్టణ అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు సింగారపు రమేష్ చొరవతో బాధితుడికి ఈ ఆర్థిక సహాయం అందింది.రాజు అనారోగ్యంతో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న సింగారపు రమేష్, వైద్య ఖర్చుల కోసం తక్షణ ఆర్థిక సహాయం అందేలా కృషి చేశారు. ఈ మేరకు రూ.2,50,000 విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్ఓసీ) మంజూరుకు సహకరించారు.బాధితుడికి వైద్య చికిత్స అందించేందుకు ఆర్థిక సహాయం లభించడంతో కుటుంబ సభ్యులకు కొంత ఊరట కలిగింది.

పాడె మోసి మానవత్వాన్ని చాటిన కాంగ్రెస్ నేత తుళ్ళ రవి



వరంగల్ /పర్వతగిరి, అక్టోబర్ 19 (నిత్యం నిఘా ప్రతినిధి):నరుకుడు రవీందర్ అంతిమయాత్ర విషాదభరిత వాతావరణంలో సాగింది. రవీందర్ మృతితో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆయన అంతిమయాత్రలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు.ఈ సందర్భంగా వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం మాజీ అధ్యక్షుడు తుళ్ళ రవి స్వయంగా పాడె మోసి మానవత్వాన్ని, మానవీయ విలువలను చాటుకున్నారు. రవీందర్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వారి దుఃఖంలో పాలుపంచుకున్నారు.అంతిమయాత్రలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ఆకులపల్లి కుమారస్వామి, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం మాజీ అధ్యక్షుడు తుళ్ళ రవి, మాజీ ఎంపీటీసీ సూరారపు నిరంజన్ పాల్గొని రవీందర్‌కు నివాళులర్పించారు.

పర్వతగిరి నూతన ఎస్సై రాజ్‌కుమార్‌కు జర్నలిస్టుల శుభాకాంక్షలు



వరంగల్ జిల్లా / పర్వతగిరి, అక్టోబర్ 19 (నిత్యం నిఘా ప్రతినిధి):పర్వతగిరి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన పెగడ రాజ్‌కుమారను సోమవారం మండల జర్నలిస్టులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు ఘన స్వాగతం పలికి, శాలువాతో సత్కరించారు.అనంతరం ఎస్సై రాజ్‌కుమార్ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజల రక్షణకు తనవంతు పూర్తి కృషి చేస్తానని తెలిపారు. ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల సహకారంతో ముందుకు సాగుతానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పోడేటి దయాకర్ (నిజం న్యూస్), గొల్లపల్లి మహేందర్ (చంద్ర న్యూస్), జిల్లా రమేష్ (మానేటి న్యూస్) తదితర జర్నలిస్టులు పాల్గొన్నారు.

టీజీపీఎస్సీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- **హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌తో వీడియో సమావేశంలో టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం**
- **అక్టోబర్ 24న అసిస్టెంట్ సైంటిస్ట్, 26న సహాయ పర్యావరణ ఇంజినీర్ పరీక్షలు**



హనుమకొండ, అక్టోబర్ 19 (నిత్యం నిఘా ప్రతినిధి):తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలిలో ఉద్యోగ నియామకాల కోసం ఈ నెల 24, 26 తేదీల్లో నిర్వహించనున్న పరీక్షలను అత్యంత పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) చైర్మన్ బుర్రా వెంకటేశం జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. పరీక్షల నిర్వహణలో చిన్నపాటి లోపానికి కూడా తావివ్వకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.సోమవారం హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన దృశ్యమాధ్యమ సమావేశంలో పరీక్షల భద్రత, సిబ్బంది నియామకం, అభ్యర్థుల తనిఖీలు, సాంకేతిక సదుపాయాలు, నిరంతర విద్యుత్ సరఫరా, ఇతర మౌలిక వసతులపై ఆయన సమీక్షించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ నుంచి కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, జిల్లా రెవెన్యూ అధికారి కె. శ్రీనివాస్, కలెక్టరేట్ పరిపాలన అధికారి గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.ఈ నెల 24న అసిస్టెంట్ సైంటిస్ట్ (అనలిస్ట్ గ్రేడ్-2), 26న సహాయ పర్యావరణ ఇంజినీర్ పోస్టులకు కంప్యూటర్ ఆధారిత పరీక్షలు నిర్వహించనున్నట్లు బుర్రా వెంకటేశం తెలిపారు. సుమారు ఏడాదిన్నర విరామం అనంతరం ప్రభుత్వ ఉద్యోగ నియామక పరీక్షలు మళ్లీ ప్రాధాన్యత సంతరించుకున్నాయని, రానున్న రోజుల్లో వరుసగా పలు పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికలను ఎంత బాధ్యతగా నిర్వహిస్తామో, ఉద్యోగ నియామక పరీక్షలను కూడా అంతే బాధ్యతతో నిర్వహించాలని సూచించారు.

ప్రశ్నపత్రాల భద్రతకు పటిష్ట చర్యలు

ప్రశ్నపత్రాల లీకేజీకి ఎలాంటి అవకాశం లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు చైర్మన్ తెలిపారు. పరీక్షకు కొద్ది గంటల ముందు ప్రశ్నపత్రాలను ఖరారు చేసే విధానాన్ని అమలు చేస్తున్నామని, అభ్యర్థులు పరీక్ష సమయంలోనే ప్రశ్నపత్రాన్ని మొదటిసారి చూసేలా సాంకేతిక ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. కంప్యూటర్ ఆధారిత పరీక్షల్లో ప్రశ్నపత్రాల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు.పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థులతో పాటు విధులు నిర్వహించే సిబ్బంది, తనిఖీ అధికారులు, ఎగిరే తనిఖీ బృందాల సభ్యులు కూడా సెల్‌ఫోన్లు తీసుకురావద్దని ఆదేశించారు. నిర్దేశిత నిబంధనల ప్రకారం ప్రధాన పరీక్షా పర్యవేక్షకుడికి మాత్రమే సెల్‌ఫోన్ వినియోగానికి వెసులుబాటు ఉంటుందని, అది కూడా పర్యవేక్షణలోనే ఉండాలని స్పష్టం చేశారు. ప్రతి 24 మంది అభ్యర్థులకు ఒక పర్యవేక్షకుడిని నియమించాలని, వారికి కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరిగా ఉండాలని సూచించారు.

విద్యుత్, తాగునీరు, వైద్య సదుపాయాలు కల్పించాలి

పరీక్షల సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా నిరంతర సరఫరాకు చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. కంప్యూటర్లు, ఇతర సాంకేతిక పరికరాలు సక్రమంగా పనిచేసేలా ముందుగానే తనిఖీ చేయాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచాలని, అభ్యర్థులు అస్వస్థతకు గురైతే కేంద్రంలోనే ప్రాథమిక చికిత్స అందించేలా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. మహిళా అభ్యర్థుల తనిఖీల కోసం మహిళా పోలీసులను ప్రత్యేకంగా నియమించాలని పేర్కొన్నారు.పరీక్షలు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు విడతల్లో జరుగుతాయని తెలిపారు. అభ్యర్థులు కనీసం గంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఉదయం 9.30 గంటలు, మధ్యాహ్నం 2 గంటల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతించబోమని స్పష్టం చేశారు. ఈ నిబంధనపై అభ్యర్థులకు ముందుగానే విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్లకు సూచించారు.పరీక్షా కేంద్రాల పరిసరాల్లో ర్యాలీలు, ధర్నాలు, రాజకీయ, ప్రాంతీయ లేదా ఇతర సభలకు అనుమతులు ఇవ్వకూడదని ఆదేశించారు. పరీక్షలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగేలా పోలీసు శాఖ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. నిబంధనలను అభ్యర్థులందరికీ సమానంగా అమలు చేయాలని స్పష్టం చేశారు.ఏర్పాట్లు పూర్తి చేస్తాం: కలెక్టర్హనుమకొండ జిల్లాలో కేటాయించిన పరీక్షా కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేస్తామని కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ తెలిపారు. అభ్యర్థులకు తాగునీరు తదితర మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు, పటిష్ట భద్రత, తనిఖీ విధానం అమలు చేస్తామని పేర్కొన్నారు. పరీక్షల సమయంలో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటామని వెల్లడించారు.

ప్రజావాణిలో నాలుగు దరఖాస్తుల స్వీకరణ



వరంగల్ /వర్ధన్నపేట, అక్టోబర్ 19 (నిత్యం నిఘా ప్రతినిధి): ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి వర్ధన్నపేట మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) కార్యాలయంలో సోమవారం నాలుగు దరఖాస్తులు అందాయి. వివిధ శాఖలకు సంబంధించిన సమస్యలపై ప్రజలు తమ వినతులను అధికారులకు సమర్పించారు.శాఖల వారీగా దరఖాస్తుల వివరాలు:- హౌసింగ్ శాఖ: 2 దరఖాస్తులు- పంచాయతీరాజ్ శాఖ (ఏఈ): 1 దరఖాస్తు- ఎక్సైజ్ శాఖ: 1 దరఖాస్తుమొత్తంగా నాలుగు దరఖాస్తులు స్వీకరించినట్లు ఎంపీడీవో కార్యాలయ వర్గాలు వెల్లడించాయి.

సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి

ప్రజావాణిలో అందిన వినతులను సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. దరఖాస్తుల స్వీకరణకే పరిమితం కాకుండా, వాటి పరిష్కారానికి ప్రాధాన్యం ఇచ్చి ప్రజలకు సకాలంలో న్యాయం అందించాలని ఆశిస్తున్నారు.

ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ నిర్మాణ కమిటీ ఎన్నిక

- **అధ్యక్షుడిగా ఆగపాటి రామకృష్ణ.. ప్రధాన కార్యదర్శిగా పేరాల పృథ్వీరాజ్**



వరంగల్ /సంగెం, అక్టోబర్ 19 (నిత్యం నిఘా ప్రతినిధి): వరంగల్ జిల్లా సంగెం మండల కేంద్రంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ నిర్మాణం కోసం గ్రామానికి చెందిన యువకులు కమిటీని ఎన్నుకున్నారు. ఆదర్శవంతమైన పరిపాలనతో చరిత్రలో నిలిచిన ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని సంగెం మండల కేంద్రంలో ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో గ్రామ సర్పంచ్ పేరాల లలిత రమేష్, ఉపసర్పంచ్ ఆగపాటి రాజు ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేశారు.కమిటీ నూతన కార్యవర్గం:- అధ్యక్షుడు: ఆగపాటి రామకృష్ణ- ఉపాధ్యక్షులు: తాడికొండ భరత్, మెట్టుపల్లి అనిల్- ప్రధాన కార్యదర్శి: పేరాల పృథ్వీరాజ్- సహాయ కార్యదర్శులు: రావుల వరుణ్, రొట్టె రాకేష్- కోశాధికారి: పులి రాజశేఖర్- సహాయ కోశాధికారులు: మునుకుంట్ల రాము, నాలం శేఖర్, మునుకుంట్ల రవి- కార్యనిర్వాహక కన్వీనర్: మునుకుంట్ల మధుకర్కార్యవర్గ సభ్యులు: ప్రశాంత్, రమేష్, రాజశేఖర్, నాగరాజు, వేణు, అనిరుద్ధ్, మెట్టిపల్లి అనిల్, కోతి కార్తీక్, నంగునూరు శివ, గుండేడి ప్రశాంత్, రాయపురం అనిల్.మీడియా కన్వీనర్లు: మండ కృష్ణ, కోడూరి రాహుల్, రాకేష్, వికాస్, పవన్ సాయి.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కందగట్ల నరహరి, వార్డు సభ్యులు మల్లికార్జున్, సందీప్, సాగర్, కృష్ణ, ఆలయ కమిటీ చైర్మన్ కోటేశ్వర్, సొసైటీ డైరెక్టర్ నలదిగల రవి, మునుగుంట్ల మోహన్ తదితరులు పాల్గొన్నారు.ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ నిర్మాణాన్ని సమష్టి కృషితో ముందుకు తీసుకెళ్లాలని ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఆకాంక్షించారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

కాకతీయ సేవా సమితి ఆధ్వర్యంలో బతుకమ్మ పోటీలు..

విజేతలకు బహుమతులు

వరంగల్, అక్టోబర్ 19 (నిత్యం నిఘా ప్రతినిధి): వరంగల్ నగరంలోని రంగసాయిపేట ప్రాంతం బెస్తం చెరువు వద్ద సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకుని కాకతీయ సేవా సమితి ఆధ్వర్యంలో బతుకమ్మ అలంకరణ, పాటల పోటీలను ఘనంగా నిర్వహించారు. సేవా సమితి అధ్యక్షుడు మండల నరసింహ రాములు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హైదరాబాద్ ఫస్ట్ అడిషనల్ ఫ్యామిలీ కోర్టు కం 14వ అదనపు మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి కంచ ప్రసాద్, వరంగల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు గంటా రవికుమార్ హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు బతుకమ్మ పండుగ విశిష్టతను వివరించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు.పోటీలకు న్యాయనిర్ణేతలుగా కత్తి సాంబయ్య, జక్కం దామోదర్, ఏలుగు రవికుమార్, కోల రాము, బొలిశెట్టి కమలాకర్, మానుపాటి వెంకటేష్ వ్యవహరించారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్, అరుణ విక్టర్, కాకతీయ సేవా సమితి అధ్యక్షుడు మండల నరసింహ రాములు, కార్యదర్శి కోక సత్యనారాయణ, కేడల పద్మ, కొండ్రెడ్డి నవీన్ రెడ్డి, శంకేసి శ్రీనివాసమూర్తి, జనతా పరపతి సంఘం అధ్యక్షుడు మల్లేశం, కోశాధికారి అనుమాండ్ల రమేష్, జై హనుమాన్ పరపతి సంఘం అధ్యక్షుడు పోశాల మల్లికార్జున్, వినాయక పరపతి సంఘం అధ్యక్షుడు బత్తిని భద్రయ్య, పోకల ఈశ్వర్, బక్కి రవీందర్, బక్కి రంజిత్, తాళ్లపల్లి అర్జున్, ఆరె కార్తీక్, కర్నే రవీందర్, షేర్ల అనిల్, పూల సమ్మయ్య బ్రదర్స్, రావుల చిన్ని, రెబ్బ రమేష్ తదితరులు పాల్గొన్నారు.అలాగే గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ, మామునూరు పోలీస్, మిల్స్ కాలనీ పోలీస్, వరంగల్ ఫైర్ స్టేషన్, ఇరిగేషన్ శాఖ అధికారులు, రంగసాయిపేట గంగపుత్ర సంఘం కమిటీ సభ్యులు, మహిళలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.





రావణవధకు పటిష్ట పోలీస్ బందోబస్తు

- **భారీ వాహనాల రాకపోకలపై ఆంక్షలు.. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి**
- **ప్రజల భద్రతకు ప్రాధాన్యం.. వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేతా**

వరంగల్, అక్టోబర్ 19 (నిత్యం నిఘా ప్రతినిధి):వరంగల్ నగరంలోని ఉర్సుగుట్ట రంగలీల మైదానంలో అక్టోబర్ 20న నిర్వహించనున్న రావణవధ కార్యక్రమానికి పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేతా తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రముఖులు, ప్రజలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో హాజరు కానున్న నేపథ్యంలో ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు వెల్లడించారు.సోమవారం సాయంత్రం వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద, ఇతర శాఖల ఉన్నతాధికారులతో కలిసి పోలీస్ కమిషనర్ ఉర్సుగుట్ట రంగలీల మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. జిల్లా యంత్రాంగం, పోలీస్ శాఖ, సంబంధిత ప్రభుత్వ విభాగాల సమన్వయంతో రావణవధ కార్యక్రమాన్ని ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

భారీ వాహనాల రాకపోకలపై ఆంక్షలు

దసరా ఉత్సవాలు, రావణవధ కార్యక్రమం నేపథ్యంలో వరంగల్ నగరంలో ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు భారీ వాహనాల రాకపోకలపై ఆంక్షలు అమలులో ఉంటాయని సీపీ స్పష్టం చేశారు. ఆంక్షలు అమలులో ఉన్న సమయంలో అనుమతి లేని భారీ వాహనాలు నగరంలోకి ప్రవేశించరాదని సూచించారు. భారీ వాహనాల డ్రైవర్లు ముందుగానే ట్రాఫిక్ పోలీసులు సూచించిన ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణిస్తూ, ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలని కోరారు.

ప్రజలు సూచనలు పాటించాలి

రావణవధ కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలు ట్రాఫిక్ పోలీసుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని సీపీ సూచించారు. వాహనాలను పోలీస్ శాఖ నిర్దేశించిన పార్కింగ్ ప్రదేశాల్లోనే నిలపాలని, రహదారులపై ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకూడదని తెలిపారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని వీలైనంత ముందుగా కార్యక్రమ ప్రాంగణానికి చేరుకోవాలని, ట్రాఫిక్ మళ్లింపులు అమలులో ఉంటే ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించుకోవాలని సూచించారు.అత్యవసర సేవల వాహనాల రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలిగించరాదని, చిన్నారులు, వృద్ధుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. పిల్లలు తప్పిపోకుండా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని, విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బందికి సహకరిస్తూ క్రమశిక్షణతో వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు.రావణవధ కార్యక్రమం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నియంత్రణతో పాటు అవసరమైన భద్రతా చర్యలు చేపడుతున్నామని సీపీ తెలిపారు. కార్యక్రమాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు ప్రజలందరూ పోలీస్ శాఖకు సహకరించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేతా విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ రాయల ప్రభాకర్ రావు, ఏసీపీలు నర్సింహారావు, ప్రశాంత్ రెడ్డి, మధుసూదన్, సదయ్య, సత్యనారాయణ, సీఐలు కర్రె స్వామి, మంగిలాల్, సుజాత, ఎస్ఐలు, ఇతర శాఖల ఉన్నతాధికారులు, దసరా ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



వికారాబాద్‌లో మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం ఎప్పుడు?

- **25వ వార్డు సుభాష్ నగర్‌లో మురుగునీటి నిల్వతో ప్రజలకు ఇబ్బందులు**
- **చేపల మార్కెట్, మాంసం దుకాణాల వ్యర్థాలతో తరచూ నిండుతున్న కాలువ**
- **సమస్య పరిష్కారానికి సమగ్ర పరిశీలన, శాశ్వత చర్యలు అవసరం**

నిత్యం నిఘా, వికారాబాద్, అక్టోబర్ 19 :
వికారాబాద్ పట్టణంలోని 25వ వార్డు సుభాష్ నగర్‌లో మురుగునీరు నిల్వ ఉండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయితే ఈ సమస్య రెండు వార్డుల సరిహద్దు ప్రాంతంలో ఉందని, అక్కడి మురుగునీటి కాలువ దిగువకు ఉండటంతో పాటు చేపల మార్కెట్, మాంసం దుకాణాల నుంచి వ్యర్థాలు చేరడం వల్ల తరచూ కాలువ నిండిపోతోందని స్థానికంగా చర్చ జరుగుతోంది.మురుగునీరు నిల్వ ఉండటంతో దుర్వాసన, దోమలు, ఈగలు పెరిగి ప్రజారోగ్యానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. ముఖ్యంగా సమీపంలోనే కూరగాయల మార్కెట్, మాంసం దుకాణాలు ఉండటంతో పారిశుద్ధ్య సమస్య మరింత ఆందోళన కలిగిస్తోంది.ఈ సమస్యపై మున్సిపల్ అధికారులు తెలుసుకున్నప్పటికీ జాప్యం జరుగుతుంది శాశ్వత పరిష్కారం మాత్రం తప్పనిసరిగా కావాలి. కాలువలో వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవడంతో పాటు, మురుగునీరు సాఫీగా వెళ్లేలా కాలువ నిర్మాణ పరిస్థితిని పరిశీలించాలి. మున్సిపల్ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి సమస్యకు పరిష్కారం చూపాలి.ఈ ప్రాంతంలోని సమస్యను పూర్తిస్థాయి వివరాలు , వాస్తవ పరిస్థితులను పరిశీలించి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న సమస్యను పరిష్కరించాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉంది. ఆరోపణలు, వివరణలకే పరిమితం కాకుండా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో చర్యలు చేపట్టి



సుభాష్ నగర్ ప్రజలకు ఉపశమనం కల్పించాలి.

రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ చైర్మన్ విజయచందర్ రెడ్డికి ఘన సన్మానం



వరంగల్/సంగెం, అక్టోబర్ 19 (నిత్యం నిఘా ప్రతినిధి): రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ చైర్మన్‌గా ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికైన డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డిని పలువురు నాయకులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా నాయకులు, నార్లవాయి గ్రామ బీజేపీ 7వ వార్డు సభ్యుడు మొలుగూరి శ్రీనివాస్ (చౌకీదార్), సంగెం మండల మాజీ అధ్యక్షుడు వడ్డి దేవేందర్ రెడ్డి, మాజీ ఉపాధ్యక్షులు పోలబోయిన పైడి, గోనె ముకుందం, మాజీ ప్రధాన కార్యదర్శులు, తిమ్మాపురం గ్రామ బీజేపీ 5వ వార్డు సభ్యురాలు కీసరి శోభ వీరయ్య, నల్లబెల్లి గ్రామ బీజేపీ 8వ వార్డు సభ్యురాలు బూక్య బిందు వెంకన్న, విజయన్న యువసేన నాయకులు కాగితాల సాయికుమార్, గుగులోతు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

దేవీ నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న కల్లెం నవజీవన్ రెడ్డి

నిత్యం నిఘా, హయత్ నగర్, అక్టోబర్ 19 : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన అమ్మవారి పూజా కార్యక్రమాల్లో హయత్ నగర్ మాజీ కార్పొరేటర్ కల్లెం నవజీవన్ రెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయం, శ్రీ రేణుక ఎల్లమ్మ యూత్ అసోసియేషన్ (మండల్ ఆఫీస్) ఆధ్వర్యంలో నిర్వహించిన నవరాత్రి ఉత్సవాల్లో, అలాగే నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో దసరా గుడి వద్ద నిర్వహించిన ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే దేవీ నవరాత్రి ఉత్సవాలు భక్తి, ఆధ్యాత్మికతతో ప్రజలందరిలో ఐక్యతను పెంపొందిస్తాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జీవన్ అన్నా మిత్ర బృందం సభ్యులు పాండల శ్రీధర్ గౌడ్, బిజెపి డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్, నక్క శ్రీకాంత్,ఆకుల అరుణ్, బీజేవైఎం నాయకులు ప్రేమ్ మరియు తదితరులు పాల్గొన్నారు.





మైసిగండి ఆలయంలో వైభవంగా చండీహోమం

: ప్రత్యేక పూజలు నిర్వహించిన మార్కెట్ చైర్‌పర్సన్ దంపతులు

నిత్యం నిఘా, కడ్తాల్, అక్టోబర్ 19 : కడ్తాల్ మండలం మైసిగండి మైసమ్మ ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజైన సోమవారం మహర్నవమిని పురస్కరించుకుని అమ్మవారు మహిషాసుర మర్దిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య నిత్యపూజలు, విశేష అర్చనలు, హోమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు.ఉత్సవాల సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీత నర్సింహా దంపతులు ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన చండీహోమం, అభిషేకాల్లో వారు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ జ్యోతితో పాటు అరుణ్, చంద్రయ్య, ఆలయ సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.



నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

ప్లాస్టిక్ నియంత్రణ ఉత్తర్వులు కాగితాలకే పరిమితమా?

- **ఖమ్మం నగరంలో ప్లాస్టిక్ వ్యాపారాల జోరు, అధికారుల పర్యవేక్షణ ఏది?**
- **బాక్సుల కొద్దీ గ్లాసులు, బస్తాల కొద్దీ కవర్లు, కమిషనర్ కంటికి కనిపించడం లేదా? మామూళ్ల ఆరోపణలపై విచారణ జరపాలి**



నిత్యం నిఘా, ఖమ్మం, అక్టోబర్ 19 :

పర్యావరణ పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై కఠిన నిబంధనలు అమలు చేస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం సైతం ప్లాస్టిక్ రహిత వాతావరణం కోసం చర్యలకు పిలుపునిస్తుంటే ఖమ్మం నగరంలోని కొన్ని మార్కెట్ ప్రాంతాల్లో మాత్రం ప్లాస్టిక్ విక్రయాల జోరు కొనసాగుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బాక్సుల కొద్దీ ప్లాస్టిక్ గ్లాసులు, బస్తాల కొద్దీ ప్లాస్టిక్ కవర్లు బహిరంగంగా విక్రయాలకు సిద్ధంగా ఉంటున్నాయనే ఆరోపణలు అధికార యంత్రాంగం పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి.

నిషేధం అమల్లో ఉందా? లేక నిబంధనలు కేవలం ప్రకటనలకే పరిమితమా?

ప్రభుత్వం నిషేధించిన ప్లాస్టిక్ వస్తువుల విక్రయాలు కొనసాగుతున్నాయనే ఆరోపణలు నిజమైతే, వాటిని అడ్డుకోవాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై లేదా? మార్కెట్ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించాల్సిన అధికారులు ఏం చేస్తున్నారు? నిషేధిత వస్తువులను నిల్వ ఉంచుతున్న వ్యాపారులపై చర్యలు తీసుకుంటున్నారా? తీసుకుంటే ఎన్ని దుకాణాలపై కేసులు నమోదు చేశారు? ఎంతమేర జరిమానాలు విధించారు? స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్ నిల్వలు ఎన్ని?ఈ ప్రశ్నలకు సమాధానాలు చెప్పాల్సిన బాధ్యత ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులపై ఉంది.

బాక్సుల కొద్దీ ప్లాస్టిక్, అధికారుల నిఘా ఎక్కడ?

ఖమ్మం నగరంలోని అనేక ప్రాంతాల్లో ప్లాస్టిక్ సామగ్రి విక్రయాలు, నిల్వలపై స్థానికంగా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. దుకాణాల్లో పెద్ద మొత్తంలో ప్లాస్టిక్ గ్లాసులు, కవర్లు నిల్వ ఉంచుతున్నారనే ఆరోపణల నేపథ్యంలో అధికారులు ప్రత్యేక తనిఖీలు చేపట్టాలనే డిమాండ్ వినిపిస్తోంది. చిన్న వ్యాపారుల నుంచి పెద్ద హోల్‌సేల్ దుకాణాల వరకు తనిఖీలు నిర్వహించి, నిషేధిత వస్తువులను గుర్తించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. కేవలం ప్రచార కార్యక్రమాలు నిర్వహించడం, అప్పుడప్పుడు తనిఖీల పేరుతో హడావుడి చేయడం వల్ల ప్లాస్టిక్ సమస్య పరిష్కారం కాదు.నిబంధనలను ఉల్లంఘించే దుకాణాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి. తప్పు చేసిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. అదే సమయంలో నిషేధిత వస్తువులు కాని ఇతర ప్లాస్టిక్ ఉత్పత్తులను చట్టవిరుద్ధంగా విక్రయిస్తున్నట్లు పొరబడకుండా, ప్రతి వస్తువును నిబంధనల ప్రకారం పరిశీలించాలి.

మామూళ్ల మత్తులో అధికారులు ఉన్నారా? విచారణకు సిద్ధమా?

ప్లాస్టిక్ విక్రయాలు బహిరంగంగా సాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్న వేళ.. సంబంధిత అధికారుల పర్యవేక్షణపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిబంధనలు ఉల్లంఘిస్తున్న దుకాణాలపై చర్యలు ఎందుకు కనిపించడం లేదనే ప్రశ్న ప్రజల్లో తలెత్తుతోంది.అయితే, అధికారులు మామూళ్లు తీసుకుంటున్నారనే ఆరోపణలకు సంబంధించి ఆధారాలు బహిర్గతం కావాల్సి ఉంది. ఈ ఆరోపణల్లో వాస్తవాలు ఉన్నాయా? తనిఖీలు ఎందుకు జరగడం లేదు? అక్రమ నిల్వలు ఉన్నట్లు ఫిర్యాదులు అందాయా? అందితే వాటిపై ఏం చర్యలు తీసుకున్నారు? అనే అంశాలపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపించాలి.అక్రమాలకు పాల్పడినవారు ఎవరైనా సరే, వ్యాపారులైనా, బాధ్యతగల అధికారులైనా, వాస్తవాలు తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి.

కమిషనర్ సాబ్, మీ దృష్టికి ఈ సమస్య వచ్చిందా?

ఖమ్మం మున్సిపల్ కమిషనర్ సాబ్ నగరంలో ప్లాస్టిక్ నియంత్రణ అమలు తీరుపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. బజార్ ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, నిషేధిత ప్లాస్టిక్ వస్తువుల నిల్వలు, విక్రయాలపై సమగ్ర నివేదిక రూపొందించాలి.ఎన్ని దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు? నిషేధిత ప్లాస్టిక్ విక్రయిస్తున్న ఎన్ని దుకాణాలను గుర్తించారు? ఇప్పటివరకు ఎన్ని కేసులు నమోదు చేశారు?ఎంత మొత్తంలో జరిమానాలు విధించారు? స్వాధీనం చేసుకున్న నిషేధిత ప్లాస్టిక్ ఎంత? తనిఖీలు క్రమం తప్పకుండా జరుగుతున్నాయా?ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు?ఈ వివరాలను ప్రజలకు వెల్లడిస్తేనే ప్లాస్టిక్ నియంత్రణపై అధికారులకు ఉన్న చిత్తశుద్ధి స్పష్టమవుతుంది.

పర్యావరణానికి ప్లాస్టిక్ శాపం, నియంత్రణలో నిర్లక్ష్యం ప్రమాదం

ప్లాస్టిక్ వ్యర్థాలు కాలువల్లో పేరుకుపోవడం, మురుగునీటి ప్రవాహానికి ఆటంకం కలిగించడం, నేల, జలవనరులను కలుషితం చేయడం వంటి సమస్యలకు కారణమవుతాయి. ముఖ్యంగా ఒకసారి వినియోగించి పారేసే ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని తగ్గించడం, నిషేధిత వస్తువుల విక్రయాలను అడ్డుకోవడం అత్యంత అవసరం.కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం 2022 జూలై 1 నుంచి గుర్తించిన కొన్ని సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల తయారీ, దిగుమతి, నిల్వ, పంపిణీ, విక్రయం, వినియోగంపై నిషేధం అమల్లోకి వచ్చింది. అలాగే 2022 డిసెంబర్ 31 నుంచి 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ క్యారీ బ్యాగులపై నిషేధం అమల్లో ఉంది. అయితే ప్రతి ప్లాస్టిక్ వస్తువూ నిషేధితమేనని భావించకుండా, సంబంధిత నిబంధనల పరిధిలోకి వచ్చే వస్తువులపైనే చర్యలు తీసుకోవాలి.

ప్రకటనలు కాదు, క్షేత్రస్థాయి చర్యలు కావాలి

ఖమ్మం నగరాన్ని ప్లాస్టిక్ రహితంగా మార్చాలంటే ముందుగా మార్కెట్ ప్రాంతాల్లో సమగ్ర తనిఖీలు నిర్వహించాలి. నిషేధిత వస్తువుల నిల్వలు, విక్రయాలపై నిఘా పెట్టాలి. వ్యాపారులకు స్పష్టమైన అవగాహన కల్పించడంతోపాటు, నిబంధనలు ఉల్లంఘించినవారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి.ప్రభుత్వ ఆదేశాలు ఉన్నా క్షేత్రస్థాయిలో అమలు కనిపించకపోతే ఆ ఆదేశాల ప్రయోజనం ఏమిటి? అధికారులు తమ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తున్నారా లేదా అన్నది ప్రజలకు తెలియాలి.ఖమ్మం బజార్లలో ప్లాస్టిక్ విక్రయాలపై వస్తున్న ఆరోపణలకు మున్సిపల్ యంత్రాంగం సమాధానం చెప్పాలి. తనిఖీల వివరాలు వెల్లడించాలి. తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి. ప్లాస్టిక్ నియంత్రణ విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా చూడాలి.ఇప్పటికైనా కమిషనర్ స్పందిస్తారా? ఖమ్మం నగరాన్ని ప్లాస్టిక్ కాలుష్యం నుంచి కాపాడేందుకు క్షేత్రస్థాయిలో చర్యలు చేపడతారా? లేక ప్లాస్టిక్ నియంత్రణ నినాదాలు ప్రకటనలకే పరిమితం అవుతాయా? ప్రజలు సమాధానం కోసం ఎదురుచూస్తున్నారు.

22న శ్రీ పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకలు
: జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



నిత్యం నిఘా, ఖమ్మం, అక్టోబర్ 19 : అక్టోబర్ 22న (గురువారం) ఉదయం 10.00 గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో శ్రీ పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి కార్యక్రమం నిర్వహించి, వారి చిత్ర పటానికి పుష్ప మాలంకరణ చేయడం జరుగు తుందని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమానికి ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ కులసంఘాలు, కుల సంఘ నాయకులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రమాద మృతుల పార్థివదేహాలకు నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే
: డాక్టర్ బి. చంద్రావతి



నిత్యం నిఘా, ఖమ్మం, అక్టోబర్ 15 : కారేపల్లి మండలం గాదేపాడు, కోమట్లగూడెం గ్రామానికి చెందిన మద్దెబోయిన వెంకటేష్, మద్దెబోయిన రమ్య రఘునాథపాలెం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది.ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో వారి పార్థివదేహాలను సందర్శించి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే డా. బి. చంద్రావతి. వారి అకాల మరణం పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబ సభ్యులకు తన సానుభూతిని తెలియజేశారు.

జిల్లా ప్రజలకు, కాంగ్రెస్ నాయకులకు,కార్యకర్తలకు, అభిమానులకు దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపిన
: జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్



నిత్యం నిఘా, ఖమ్మం, అక్టోబర్ 19 : దసరా పండుగను పురస్కరించుకొని జిల్లా ఆడ పడుచులకు ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా బతుకమ్మ పండుగ కేవలం పూల పండుగ మాత్రమే కాదని ఈ బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రజల ఆత్మకు ప్రతి రూపమని అదే విధంగా రక రకాల పూలు,రకరకాల వాసనలతో మహిళలు సంతోషంగా జరుపుకొనే పండుగ అన్ని వర్గాల ప్రజలను ఒకచోట చేర్చి సామాజిక న్యాయానికి, సమానత్వానికి ప్రతీకగా జరుపుకొనే బతుకమ్మ వేడుకల సందర్భంగా జిల్లా లోని ప్రతి మహిళకు హృదయపూర్వక శుభాకాంక్షలు పత్రికా ముఖంగా తెలిపిన జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్.

సద్దుల బతుకమ్మ సంబరాల్లో మహిళలతో మమేకమైన
మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బానోత్ చంద్రావతి





నిత్యం నిఘా, ఖమ్మం, అక్టోబర్ 19 : సద్దుల బతుకమ్మ వేడుకల్లో భాగంగా ఏన్కూరు మండలంలో శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం, వైరా మున్సిపాలిటీ 15వ వార్డు, దిద్దుపూడి, ఖమ్మం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం, బుర్హాన్‌పురం, చెరువు బజార్ తదితర ప్రాంతాల్లో అంగరంగ వైభవంగా నిర్వహించిన సద్దుల బతుకమ్మ ముగింపు వేడుకల్లో వైరా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బి. చంద్రావతి పాల్గొన్నారు.ఈ సందర్భంగా స్థానిక మహిళలతో ఆత్మీయంగా మమేకమై, వారితో కలిసి బతుకమ్మ ఆడి పండుగ సంబరాల్లో ఉత్సాహంగా పాలుపంచుకున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు, మహిళల ఐక్యతకు, ఆత్మీయ అనుబంధాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ విశిష్టతను స్మరించుకుంటూ, మహిళలందరికీ సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.కూడా నిరంతరం పర్యవేక్షించాలి.ఖమ్మం జిల్లాలో మెడికల్ షాపులపై సమగ్ర తనిఖీలు ఎప్పుడు ప్రారంభమవుతాయి? లైసెన్సులు, ఫార్మసిస్ట్‌ల అర్హతలు, ఔషధాల విక్రయాలపై అధికారులు ఎప్పుడు స్పష్టమైన నివేదిక విడుదల చేస్తారు? ప్రజల్లో తలెత్తుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత సంబంధిత యంత్రాంగంపై ఉంది.

జర్నలిస్టు వడ్డూరి మృతికి
టీడబ్ల్యూజేఎఫ్ సంతాపం

- **నివాళులర్పించిన రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య**



నిత్యం నిఘా, హైదరాబాద్, అక్టోబర్ 19 : అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గుండెపోటు తో మరణించిన సీనియర్ జర్నలిస్టు వడ్డూరి శ్రీనివాసరావు బౌతిక కాయానికి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య నివాళులర్పించారు. సోమవారం మధ్యాహ్నం శ్రీనివాసరావు బౌతిక కాయానికి నాగోల్ స్మశాన వాటిలో అంత్యక్రియలు జరిగాయి. అంత్యక్రియలకు హాజరైన మామిడి సోమయ్య శ్రీనివాసరావు బౌతిక కాయం పై పూలమాల ఉంచి ఘనంగా నివాళులర్పించారు. ఆయనతో పాటు ఫెడరేషన్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు కుంచం శ్రీనివాస్ కూడా శ్రీనివాసరావు కు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు కుటుంబ సభ్యులను మామిడి సోమయ్య పరామర్శించి ఓదార్చారు. నలభై ఏళ్ళుగా జర్నలిజం వృత్తిలో కొనసాగిన వడ్డూరి శ్రీనివాసరావు చివరిదాకా వృత్తిని నమ్ముకొని, నీతి నిజాయితీతో జీవించారని మామిడి సోమయ్య పేర్కొన్నారు. పలు ప్రధాన పత్రికల్లో సబ్ ఎడిటర్, సీనియర్ సబ్ ఎడిటర్ గా నిబద్ధతతో పని చేసిన శ్రీనివాసరావు మరణం మీడియా రంగానికి, జర్నలిజానికి తీరని లోటు అని అన్నారు. శ్రీనివాసరావు జర్నలిస్టుగా నలభై ఏళ్ళు పనిచేసినా ఇంతవరకు ప్రభుత్వం నుంచి ఇంటి స్థలం పొందలేకపోయారని, ఇంటి స్థలం కల నెరవేరకుండానే చనిపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పేదరికంలో ఉన్న శ్రీనివాసరావు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

Printed, Published and Owned by Bura Nagesh Goud, on behalf of Amulya Publications & Printers Graphics, Editor - Bura Nagesh Goud, is responsible for news selection under PRB act prgi.gov.in RNI. TGTEL/25/A1665, # 5-11-1014/A, Naim Nagar, Hanamkonda, Warangal, Telangana, India - 506009, Cell : 9441974025, 9440170543 Email:nityamnigha.acs@gmail.com